### ఇండియా- యురోపియన్ యూనియన్ మధ్య కుదిరిన భారీ వాణిజ్య ఒప్పందం

న్యూడిల్లీ,ఇండియా–ఈయూ (యురోపియన్ యూనియన్) మధ్య భారీ వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇది చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అని, మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ అని ప్రధాని మోదీ అభివర్ణించారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన ఈ ప్రకటన చేశారు. యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్, యురోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ అంటోనియో లూయిస్‌తో కలిసి ఉమ్మడిగా మోదీ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు.దీనిపై ఒప్పందం కుదిరిందన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఇండియా–ఈయూ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్షోభాన్ని నివారించడంలో సాయపడుతుందన్నారు. ఇది ఇండియా, యూరప్ ప్రజలకు అద్భుత అవకాశాలను కల్పిస్తుందని, ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై మన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని మోదీ అన్నారు. ప్రపంచ జీడీపీలో ఇండియా–ఈయూ వ్యాపార భాగస్వామ్య వాటా 25 శాతం ఉందని పేర్కొన్నారు. ఇండియా– ఈయూ మధ్య 1962 నుంచి నుంచి వ్యాపార, వాణిజ్య ఒప్పందం కొనసాగింది. ఇది 2004 నుంచి వ్యూహాత్మకంగా మారింది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :287 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 29-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## సింగరేణి కార్మికులకు గుడ్ న్యూస్.. భట్టి విక్రమార్క కీలక ప్రకటన!



హైదరాబాద్,సింగరేణి కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కవెల్లడించారు. సింగరేణి కార్మికుల కోసం తాజాగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఈ మేరకు హైదరాబాద్లో బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సింగరేణి ఉద్యోగుల మారు పేరుకు సంబంధించి త్వరితగతిన పరిష్కారం చేస్తామన్నారు. అలాగే మెడికల్ ఇన్వాల్యుయేషన్ సంబంధించి వాళ్లకున్న వ్యాధులకు సంబంధించి అన్ని విధాల పరిష్కారం చూపిస్తామని చెప్పారు.

కార్మికుల కోసం కొత్త కమిటీ

కోల్ ఇండియ నిబంధనల మేరకు సింగరేణి అధికారులకు కల్పిస్తున్న సౌకర్యాలను కార్మికులకు కూడా వర్తింప చేయడం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే సింగరేణి ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం ఐఫోర్ కమిటీ నిర్ణయించి, వారి కల సాకారం చేస్తామని పేర్కొన్నారు. కాగా ఇప్పటికే సింగరేణి ఉద్యోగులందరికీ దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఈ పథకం దేశవ్యాప్తంగా ఒక నమూనాగా గుర్తింపు పొందిందని తెలిపారు. అదేవిధంగా సంస్థలో పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల కోసం రూ. 40 లక్షల ఉచిత ప్రమాద బీమా పథకం అమలు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా కారుణ్య నియామకాల్లో వారసుల గరిష్ఠ వయోపరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.తమ ప్రభుత్వం సింగరేణిలో 2,539 పోస్టులను భర్తీ చేయడం జరిగిందని చెప్పారు. వీటిలో 798 ఎక్స్ టర్నల్ పోస్టులు ఉండగా, 1,741 కారుణ్య నియామకాలు ఉన్నాయని వివరించారు. వీటితో పాటు, క్యాథ్ ల్యాబ్ల ఏర్పాటు ద్వారా సింగరేణి ఆసుపత్రులను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగా మార్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇక 2024–25లో సింగరేణి చరిత్రలో అత్యధికంగా రూ. 6,394 కోట్లు సాధించగా, అత్యధికంగా 34 శాతం లాభాల వాటా కింద రూ. 802 కోట్లను కార్మికులకు చెల్లించామన్నారు. వీరితో పాటు, పొరుగు సేవల సిబ్బందికి కూడా రూ. 5,500 చొప్పున లాభాల్లో వాటా చెల్లించినట్లు తెలిపారు.

## విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

ముంబై: విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్(66) దుర్మరణం చెందారు. బుధవారం ఉదయం ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో పవార్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్? ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబయి నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అజిత్ పవార్ తో పాటు ఇద్దరు పైలట్లు, సెక్యూరిటీ గార్డు, పిఏ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రతలో విమానం ముక్కలుగా విడిపోగా.. మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. అజిత్ పవార్ మృతదేహాన్ని బారామణి మెడికల్ కాలేజీకి తరలించారు.సాంకేతిక లోపం కారణంగానే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ముంబయి నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తిందని సమాచారం, విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలోఅదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. విమాన ప్రమాదంపై డీజీసీఏ స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. కూలిన విమానం బంబార్డియర్ లిర్జట్ 45రకం 8సీటర్ విమానంగా పేర్కొంది.

అజిత్ పవార్ రాజకీయ ప్రస్థానం

అజిత్ పవార్ 1959 జూలై 22న జన్మించాడు. ఆయన తండ్రి అనంత్‌రావ్ పవార్ మహారాష్ట్ర రాజకీయాల్లో సీనియర్ రాజకీయ నాయకుడిగా కొనసాగారు. మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్‌కు సోదరుడు. బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన అజిత్‌పవార్ 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. 16ఏళ్ల పాటు పూనే జిల్లా



సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గా వ్యవహరించారు. 1991 లో తొలిసారి బారామతి నుంచి తొలిసారి లోక్ సభకు ఎన్నికయ్యారు. అనంతరం బాబాయి శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి.. రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. శరద్ పవార్ తో విబేధించి సొంత పార్టీ పెట్టుకున్నారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు. అంతకుముందు షిండే మంత్రివర్గంలోనూ డిప్యూటీ సీఎంగా కొనసాగారు.అజిత్ పవార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా సహా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్, మంత్రివర్గ సహచరులు తమ తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని తెలిపారు.

## మొదలైన మేడారం మహాజాతర..

వరంగల్, జనవరి 28,ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర నేటి నుంచి ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. సాంకేతికతను ఉపయోగించి భద్రతను పటిష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం అనేక వసతులు కల్పించారుఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర నేటి నుంచి నాలుగు రోజుల పాటు ఘనంగా జరగనుంది. రెండేళ్లకోసారి జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుక ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో కోలాహలంగా ప్రారంభమైంది. కోట్ల మంది భక్తుల కొంగుబంగారమైన వనదేవతలు గద్దెలపై కొలువుదీరే శు భఘడియలు ఆసన్నమవడంతో.. అటవీ ప్రాంతమంతా భక్తజన సంద్రమైంది. నేటి నుంచి ఈ నెల 31 వరకు నాలుగు రోజుల పాటు వైభవంగా సాగే ఈ జాతరకు ప్రభుత్వం సుమారు రూ. 251 కోట్ల నిధులతో భారీ ఏర్పాట్లు చేసింది.మేడారం జాతరలో మొదటి ఘట్టం సారలమ్మ రాకతో మొదలవుతుంది. ఇవాళ సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మను ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజారులు గద్దెపైకి తీసుకొస్తారు. అదే సమయంలో మహబూబాబాద్ జిల్లా పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజులు పెళ్లికొడుకుల రూపంలో కాలినడకన మేడారానికి చేరుకుంటారు. జాతరలో అత్యంత కీలక ఘట్టం గురువారం నాడు జరిగే సమ్మక్క ఆగమనం. చిలుకలగుట్టపై నుంచి కుంకుమభరిణ రూపంలో ఉన్న సమ్మక్కను పూజారులు గద్దెపైకి తెచ్చే సమయంలో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పిస్తారు. శుక్రవారం నాడు భక్తులు దేవతలకు నిలువెత్తు 'బంగారం' (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. శనివారం దేవతల 'వన ప్రవేశం'తో ఈ మహాక్రతువు ముగుస్తుంది.ఈ ఏడాది సుమారు కోటిన్నర మంది భక్తులు మేడారానికి వస్తారని అంచనా. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గద్దెల ప్రాంగణాన్ని పునర్నిర్మించడంతో పాటు, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను ఆధునీకరించింది. రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ వేల సంఖ్యలో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. వైద్యారోగ్య శాఖ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయగా.. విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా కోసం



21 శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. గిరిజన సంప్రదాయాలను గౌరవిస్తూనే.. ఆధునిక వసతులతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది.ఈసారి మేడారం జాతరలో సాంకేతికత ప్రధాన ఆకర్షణగా నిలిచింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు తొలిసారిగా కృత్రిమ మేధ (ఎఐ) పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. జనసమూహాన్ని పర్యవేక్షించడంతో పాటు, జాతరలో తప్పిపోయిన చిన్న పిల్లలను, వృద్ధులను ముఖ గుర్తింపు ద్వారా త్వరగా గుర్తించేందుకు ఈ టెక్నాలజీ తోడ్పడుతోంది. వేల సంఖ్యలో సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘాతో జాతరను హైటెక్ హంగులతో నిర్వహిస్తున్నారు.

పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు పయనం

జాతరలో భాగంగా మంగళవారమే పగిడిద్దరాజు పయనం మొదలైంది. పూనుగొండ్ల గ్రామంలోని పెనుక వంశీయుల ఆధ్వర్యంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి, సుమారు 62 కిలోమీటర్ల మేర అటవీ మార్గంలో కాలినడకన మేడారానికి తీసుకువస్తున్నారు. ఆదివాసీల డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య సాగే ఈ ఊరేగింపు భక్తిభావంతో సాగుతోంది. ఇవాళ సాయంత్రానికి పగిడిద్దరాజు మేడారం చేరుకోవడంతో జాతరలో తొలి ప్రధాన ఘట్టం పూర్తవుతుంది.

## పేదరికం నుంచి 25 కోట్ల మందికి విముక్తి: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



న్యూఢిల్లీ,పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. ఎన్డీఏ పదేళ్ల పాలనలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. 100 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు అందించామని.. ఆయుష్మాన్ భారత్ ద్వారా కోట్ల మందికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వికసిత్ భారత్‌లో రైతులకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని వెల్లడించారు. ఆత్మనిర్భర్? భారత్? సాధన కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని దేశం సంస్కరణల పథంలో దూసుకెళ్తోందన్నారు. పీఎల్ఐ పథకం కింద పారిశ్రామికోత్పత్తిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. సముద్ర వ్యాపారాన్ని మరింత పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వెల్లడించారు. గతేడాది నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం మన సత్తాను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. భారత్‌పై దాడి చేస్తే ఏం జరుగుతుందో ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ఈ ఆపరేషన్? తర్వాత డిఫెన్స్? ఎగుమతులు రికార్డు స్థాయిలో పెరిగినట్లు వెల్లడించారు.

## ఇరాన్ వైపు మరిన్ని యుద్ధ నౌకలు : ట్రంప్

న్యూఢిల్లీ: ఇరాన్ తో యుద్ధం దిశగా అమెరికా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇరాన్ చుట్టుతన అతిపెద్ద విమాన వాహక పౌక అబ్రహం లింకన్ సహా పలు యుద్ధ నౌకలను మోహరించిన సంగతి తెలిసిందే. తాజాగా మరిన్ని యుద్ధనౌకలు ఇరాన్ వైపు కదులుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. వాటిని వినియోగించే అవసరం రాకూడదని తాను ఆశిస్తున్నట్లు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ చేసిన తాజా ప్రకటన పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణాన్ని పెంచేదిగా కనిపిస్తుంది. అదనపు వైమానిక దళాలను కూడా ఇరాన్ వైపు తరలిస్తున్నట్లుగా అమెరికా పేర్కొంది. తాజా బలగాల మోహరింపు ప్రక్రియ అమెరికాకు వైమానిక దాడులు, ఖచ్చితమైన క్షిపణి దాడులు చేసేందుకు బలాన్ని అందిస్తుంది.ప్రస్తుతం మరో అందమైన యుద్ధనౌక ఇరాన్ వైపు ప్రయాణిస్తోందనొ ఇరాన్ ఒక ఒప్పందం చేసుకుంటుందని ఆశిస్తున్నామని, ఇప్పటికే వారు ఒప్పందాన్ని చేసుకుని ఉండాల్సిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే ఒప్పందం దిశగా నాకు చాలాసార్లు ఫోన్? చేశారు' అని ట్రంప్? వెల్లడించారు. ఇరాన్ లో అంతర్గత అల్లర్ల కారణంగా వేలాది మంది చనిపోవడం పట్ల మండిపడిన ట్రంప్..



పరిస్థితులు శాంతించకపోతే ఆ దేశంపై యుద్ధానికి సిద్ధమవుతామన్నారు. దీంతో ఇరాన్‌పై యూఎస్ ఏక్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా దాడుల ముప్పు నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ కొన్ని రోజులుగా రహస్య బంకర్ కే పరిమితమయ్యారు. అమెరికా సైనిక బలగాల మోహరింపుపై ఇరాన్ తీవ్రంగా స్పందిస్తుంది. సైనికపరంగా దాడి చేస్తే నిర్ణయాత్మకంగా, కఠినంగా స్పందిస్తామని హెచ్చరించింది.

## అజిత్ పవార్ విమానం వెనుక భయంకర నిజాలు!



ముంబై:మహారాష్ట్ర రాజకీయాల్లో పెను విషాదం నింపిన అజిత్ పవార్ విమాన ప్రమాదం ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి బయటకు వస్తున్న ఒక్కో నిజం విస్తుగొలిపేలా ఉంది. ముఖ్యంగా బుధవారం ఉదయం బారామతిలో కూలిపోయిన అదే విమానం గతంలోనూ ప్రమాదానికి గురవ్వడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది.మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తూ మరణించిన లియర్ జెట్ 45 (రిజిస్ట్రేషన్: వీటీ – ఎసస్.కే) విమానం గత చరిత్ర ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఒకసారి చావు అంచు వరకు వెళ్లి వచ్చిన విమానమే.. ఇప్పుడు ఐదుగురి ప్రాణాలను బలి తీసుకోవడం గమనార్హం.

2023లో తప్పిన పెను ప్రమాదం

ఈ విమానం మొదటిసారి వార్తల్లోకి వచ్చింది 2023 సెప్టెంబర్‌లో. ముంబై విమానాశ్రయంలో భారీ వర్షం కురుస్తున్న సమయంలో ఈ ప్రైవేట్ జెట్ ల్యాండింగ్‌కు ప్రయత్నించింది. అయితే రన్‌వేపై పట్టు కోల్పోయి పక్కకు దూసుకెళ్లి అదుపుతప్పింది. నాటి ఘటనలో విమానంలో 8 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం తీవ్రంగా దెబ్బతింది, ప్రయాణికులు గాయపడ్డారు కానీ ప్రాణాలతో బయటపడ్డారు. ఆ ప్రమాదం తర్వాత విమానానికి మరమ్మతులు చేసి, సాంకేతిక అనుమతులు పొందినట్లు చూపిస్తూ మళ్లీ గాల్లోకి పంపారు.

బారామతిలో ఏం జరిగింది?

బుధవారం ఉదయం 8:45 గంటల సమయంలో ముంబై నుంచి బారామతికి చేరుకున్న ఈ విమానం ల్యాండింగ్?కు కొద్ది నిమిషాల ముందు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయింది. రెప్పపాటు కాలంలోనే నేలకూలి మంటల్లో చిక్కుకుంది. అజిత్ పవార్, ఆయన వ్యక్తిగత భద్రతా అధికారి (పీఎస?), అటెండెంట్ ఇద్దరు పైలట్లు అక్కడికక్కడే మరణించారు. ఢిల్లీకి చెందిన వీఎస?ర్ వెంచర్స్ అనే సంస్థ ఈ విమానాన్ని చార్టర్ సర్వీసుగా నడుపుతోంది.

అనుమానాల సుడిగుండంలో భద్రతా లోపాలు

ఒకసారి ప్రమాదానికి గురై తీవ్రంగా దెబ్బతిన్న విమానాన్ని అత్యంత కీలకమైన రాజకీయ నేతల ప్రయాణాలకు ఎలా అనుమతించారనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న.గత ప్రమాదం వల్ల విమానం స్ట్రక్చర్‌లో ఏదైనా అంతర్గత బలహీనత ఉండిపోయిందా? ప్రమాదానికి గురైన విమానానికి క్లియరెన్స్ ఇచ్చిన అధికారులు ఎవరు ల్యాండింగ్ సమయంలో వాతావరణం అనుకూలించలేదా లేక యంత్ర వైఫల్యమా? అన్నది తేలాల్సి ఉంది.

డీజీసీఏ రంగంలోకి..

ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించింది. విమాన గమనాన్ని రికార్డ్ చేసే బ్లాక్ బాక్స్ డేటాను విశ్లేషించనున్నారు. గత రెండేళ్లుగా ఈ విమానానికి చేసిన మరమ్మతుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.ఆరుసార్లు ఉపముఖ్యమంత్రిగా రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నేతగా ఎదిగిన అజిత్ పవార్ ఇలాంటి విమాన ప్రమాదంలో మరణించడం మహారాష్ట్రకు తీరని లోటు. పాత ప్రమాదాల చరిత్ర ఉన్న విమానాలను వీఐపీల కోసం వాడటంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

## ఫిరాయింపుల ఎపిసోడ్‌లో బిగ్ ట్విస్ట్




హైదరాబాద్: తెలంగాణ ఫిరాయింపుల ఎపిసోడ్‌లో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. పెండింగ్‌లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేల్లో ఒకరైన.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీన తన ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఆయన పేర్కొన్నారు. కారు గుర్తుపై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే స్పీకర్ చర్యలకు తీసుకోవడం లేదంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో కోర్టు డెడ్‌లైన్‌లు, వార్నింగ్‌లతో స్పీకర్ గడ్డం ప్రసాద్ విచారణ చేపట్టారు. ఇప్పటికే ఏడుగురిని విచారించిన స్పీకర్.. వాళ్లు పార్టీ మారినట్లు ఆధారాల్లేవంటూ పిటిషన్లు కొట్టేస్తూ తీర్పు ఇచ్చారు. అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్, ప్రకాష్ గౌడ్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు క్లీన్ చిట్ ఇచ్చారు.ఈ క్రమంలో మిగిలిన ముగ్గురు డాక్టర్ సంజయ్, దానం నాగేందర్, కడియం శ్రీహరిలను విచారణ జరపాల్సి ఉంది. అయితే హఠాత్తుగా ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు తాజాగా నోటీసులు ఇచ్చారు. అలాగే దానం నాగేందర్ పై అనర్హత పిటిషన్ వేసిన బీఆరస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సైతం స్పీకర్ నోటీసులు ఇచ్చారు. వీరిద్దరు ఈ నెల 30న విచారణకు హాజరుకావాలని వేర్వేరుగా ఇచ్చిన నోటీసులలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విషయంలో చేస్తున్న జాప్యంపై ఈనెల 19వ తేదీన స్పీకర్ కు సుప్రీంకోర్టు కోర్టు ధిక్కర నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు ఇవ్వడం ఆసక్తిగా మారింది. దానం నాగేందర్ బీఆరస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ పై ఎంపీగా పోటీ చేయడం తెలిసిందే.

## సంపాదకీయం

**గురువారం 29-01-2026**

# సందేహాల పునాదిపై శాంతి సౌధం

రెండో ప్రపంచ యుద్ధం తరవాత అమెరికా, సోవియట్?ల మధ్య రెండు ధ్రువాలుగా ప్రపంచం చీలింది. సోవియట్? పతనంతో బహుళ ధ్రువ ప్రపంచం సాకారమవుతోందని, సమతుల్యత ఏర్పడుతోందని అనుకున్నారు. కానీ, ట్రంప్? నాయకత్వంలోని అమెరికా వాటిని వమ్ము చేసి, 'బలవంతులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తారు, బలహీనులు గత్యంతరం లేక వారి ఆగడాలను భరిస్తారు' అనే ప్రాచీన గ్రీకు నీతిని అమలులో పెడుతోంది. ఈ తరహా రాజనీతి సుస్థిర శాంతిని నెలకొల్పదు.రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఎనిమిది దశాబ్దాల పాటు అమెరికా ఊతంతో నడిచిన అంతర్జాతీయ సంస్థలు ఇప్పుడు బలహీనపడిపోయాయి. దానికి కారణం– ట్రంప్? జమానాలో అమెరికా అనుసరిస్తున్న విధానాలే. ట్రంప్? రెండోసారి అధ్యక్షుడైనప్పటి నుంచి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. ప్రపంచాన్ని ఉదారవాదం నుంచి మితవాదం వైపు నెడుతున్నారు. అంతర్జాతీయ సంబంధాలను వ్యాపార లావాదేవీల స్థాయికి దిగజార్చుతున్నారు. ఈ వాతావరణంలోనే దావోస్? ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల సందర్భంగా గాజాలో శాంతి సాధన మండలిని (బోర్డ్? ఆఫ్? పీస్?–బీవోపీ) ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి నిరుడు నవంబరులో ఆమోదించిన 2803వ తీర్మానం ప్రకారమే బీవోపీని పట్టాలకెక్కిస్తున్నట్లు ట్రంప్? ప్రకటించారు. గాజాలో తాత్కాలికంగా శాంతి రక్షణ సేనను ఏర్పాటుచేయాలని, గాజా పునర్నిర్మాణానికి జాతీయ పాలనా కమిటీని నెలకొల్పాలని ఐరాస తీర్మానం ప్రతిపాదించింది. దాని అమలుకే బీవోపీని నెలకొల్పినట్లు ట్రంప్? ప్రకటించారు. కానీ, ఈ బోర్డుకూ ఐరాస తీర్మానం ఉద్దేశించిన దానికీ పోలికే లేదని విమర్శలు వచ్చాయి. నిజానికి ట్రంప్? తెచ్చిన బీవోపీ ప్రస్తుత అంతర్జాతీయ సంస్థాగత వ్యవస్థను నాశనం చేయడమో లేక దాని పతనానికి బీజం వేయడమో తప్ప సమస్యకు స్థిరమైన పరిష్కారాన్ని చూపదు.

ఐక్యరాజ్య సమితిని కాదని...

అంతర్జాతీయ సంస్థల మధ్యవర్తిత్వంతో సంప్రదింపులతో సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ప్రపంచంలో అగ్ర ఆర్థిక, సైనిక శక్తి హోదాలో అమెరికా తానే ఏకపక్షంగా శాంతిని రుద్దుతాననడం సమంజసం కాదు. పశ్చిమాసియా వంటి నిత్యాగ్నిగుండంలో ట్రంప్? ఏర్పరచే శాంతి మండలి సాధించేది ఏమీ ఉండదని, అసలు అది ఆచరణయోగ్యం కాదని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. దీనికి చరిత్రే సాక్ష్యం. పశ్చిమాసియా తరచూ సంక్షోభాల సుడిగుండంలో చిక్కుకుపోతుంది. ఎన్నో దశాబ్దాల నుంచి అక్కడ కొనసాగుతున్న రాజకీయ విభేదాలు ఒక్క మండలి ఏర్పాటుతో సమసిపోయేవి కావు. పశ్చిమాసియాలో అనేకానేక గ్రూపులు అస్తిత్వం కోసం నిరంతర పోరాటం జరుపుతున్నాయి. ట్రంప్? బీవోపీ కాలపరిమితి 2027 వరకే ఉంటుంది. ఈ రెండేళ్లలో గాజా సంక్షోభానికి శాశ్వత పరిష్కారం దొరుకుతుందనుకోవడం పేరాశ అవుతుంది. ఐక్యరాజ్య సమితి మరొక తీర్మానం చేసి బోర్డు పదవీ కాలాన్ని పొడిగించక తప్పదు. గాజా శాంతి మండలిలో చేరాల్సిందిగా ఈ జనవరి వరకు ట్రంప్? ఆహ్వానించిన 62 దేశాల్లో 20 మాత్రమే అందుకు సమ్మతించాయి. పలు ప్రముఖ ఐరోపా దేశాలు బోర్డుకు దూరంగా ఉండిపోయాయి. ట్రంప్? భారత్?ను కూడా ఆహ్వానించినా దిల్లీ దీర్ఘాలోచనలో పడింది. గాజా శాంతి మండలిలో చేరితే పశ్చిమాసియాలో, ఇండో–పసిఫిక్?లో భారత్? ప్రాబల్యం పెరిగే మాట నిజమే. సౌదీ అరేబియా, యునైటెడ్? అరబ్? ఎమిరేట్స్? వంటి బలమైన పశ్చిమాసియా దేశాలతో దిల్లీకి పటిష్ఠ సంబంధాలు ఉన్నాయి కూడా. అయితే, శాంతి మండలి ఐక్యరాజ్య సమితి ప్రత్యక్ష సారథ్యంలో కాకుండా ట్రంప్? అజమాయిషీలో ఉంటుంది. అమెరికాలో అధ్యక్షుడు మారినా, అంతర్జాతీయ పరిణామాల్లో మార్పు వచ్చినా ఆ మండలి మూణ్నాళ్ల ముచ్చటగా మిగలవచ్చని భారత్? సందేహిస్తోంది. అమెరికా సర్కారు ఒత్తిడికి తలొగ్గి ప్రస్తుతానికి పశ్చిమాసియా దేశాలు తాత్కాలికంగానైనా తమ విభేదాలను పక్కనపెట్టి సంప్రదింపుల బల్ల దగ్గర కూర్చుంటున్నాయి. అమెరికా ఒత్తిడి దౌత్యం ఏకాభిప్రాయం సాధించలేకపోయినా, దేశాలను బలవంతంగానైనా సహకారానికి ఒప్పించగలదని దీన్నిబట్టి తేలుతోంది. ట్రంప్? ఆహ్వానించిన దేశాలలో అత్యధికం శాంతి మండలిలో చేరడానికి తటపటాయిస్తున్నాయంటే దానికి పలు కారణాలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక దేశాలు ఐక్యరాజ్య సమితి నిబంధనావళికి, సమితి వేదికగా సమస్యలు పరిష్కరించుకోవాలనే సూత్రానికీ కట్టుబడి ఉన్నాయి. మరోవైపు ట్రంప్? ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి సమితి అనుబంధ వేదికల నుంచి నిష్క్రమిస్తున్నారు. సమితిని కాదని తానే సమస్యలను పరిష్కరిస్తానంటున్నారు. ఐరాస ద్వారా సర్వామోదనీయ పరిష్కారం సాధించాలనే సంప్రదాయానికి భిన్నంగా ఒత్తిడి, ఆంక్షల అస్త్రాలతో ఫలితాలు సాధిస్తానంటున్నారు. ట్రంప్? శాంతి మండలిలో చేరితే తమంతట తామే సమితిని బలహీనపరచినట్లు అవుతుందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి.

ఇండియా ఆచితూచి...

ట్రంప్? ఆహ్వానాన్ని మన్నించి గాజా శాంతి మండలిలో భారత్? చేరితే పశ్చిమాసియా వంటి కీలకమైన ప్రాంతంలో సమితి వంటి అంతర్జాతీయ వేదికలను కాదని స్వతంత్రంగా వ్యవహరించే శక్తిమంతమైన దేశాల క్లబ్బులో చేరినట్లవుతుంది. అదే సమయంలో నిర్దిష్ట పరిమితులు, జవాబుదారీతనం లేకుండా ఇష్టారాజ్యంగా ప్రవర్తించే దేశాలతో భుజం కలిపినట్లూ అవుతుంది. తద్వారా సంప్రదాయ అంతర్జాతీయ వేదికలకు దూరం కావాల్సి వస్తుంది. మరోవైపు శాంతి మండలి పదవీకాలం ముగిసేలోగానే ట్రంప్? దానికి మంగళం పాడినా ఆశ్చర్యం లేదు. ఇజ్రాయెల్? శాంతి మండలిలో చేరినా తుర్కియే, పాకిస్థాన్, ఖతార్? దేశాలూ అందులో సభ్యులుగా ఉండటం చిక్కు పరిస్థితిని తెచ్చిపెడుతోంది. అమెరికా ఒత్తిడితో బలవంతంగా ఆ దేశాలతో సహకారానికి తలొగ్గినా ఎవరు తుమ్మినా ఊడిపోయే ముక్కుగానే శాంతి మండలి మిగిలిపోవచ్చు. భారతదేశం విషయానికొస్తే అమెరికాతో బంధాన్ని కాపాడుకోవడానికి మండలిలో చేరే విషయమై ఆలోచించాల్సి వస్తుంది. పశ్చిమాసియాలో తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికీ ప్రాధాన్యం ఇవ్వాల్సి రావచ్చు. కాబట్టి, దిల్లీ ఆచితూచి అడుగేయాల్సి ఉంటుంది.

# యూపీ తర్వాతే ఏపీనే...




తిరుపతి,ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ బడుల్లో పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కేంద్రం సహకారంతో.. పీఎంశ్రీ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పిస్తూ, వృత్తి విద్యతో పాటు ఆధునిక విద్యను అందిస్తోంది. ఆటపాటలతో పాటు, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, పిల్లల సమగ్ర వికాసానికి కృషి చేస్తోంది. భవిష్యత్తుకు బాటలు వేసేలా ఈ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నారు. దేశంలోనే యూపీ తర్వాత ఏపీలోనే ఎక్కువ పీఎంశ్రీ స్కూళు ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ దిశగా కేంద్రం సహకారంతో పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 1,725 పీఎంశ్రీ పాఠశాలలతో మొదటి స్థానంలో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ 935 పాఠశాలలతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం 60 శాతం నిధులను.. మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.407.53 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటికే సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఈ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్వహణ ఖర్చుల కోసం నిధులను విడుదల చేశారు. ఈ నిధులు రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఇచ్చారు.రాష్ట్రంలో 794 పాఠశాలల్లో 9 నుండి 12 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులను అందిస్తున్నారు. ఈ పాఠశాలల్లో 10 రకాల వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టడానికి వీలుగా ప్రతి పాఠశాలలో ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించడానికి 1,898 ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. ఈ కోర్సుల కోసం 1,898 మంది శిక్షకులను నియమించగా.. శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన శిక్షకులను నియమించారు. వీరిలో 400 మంది ఎన్ఎస్‌డీసీ నుంచి గుర్తింపు పొందిన నిపుణులు. ఇది విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా చూస్తుంది. ఈ వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తాయి.విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దసరా, సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు సమీపంలోని పరిశ్రమలు, సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌లు అందిస్తున్నారు. అంతేకాదు వృత్తి విద్య కోర్సులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తున్నారు. ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన 'కౌశల్ బోధ్' పుస్తకాలను ఆరు నుంచి 8వ తరగతి విద్యార్థులకు అందజేస్తున్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెంటర్లకు అవసరమైన ప్రత్యేక సామాగ్రిని అందిస్తారు. విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస విధానం (పాల్)ను అమలు చేస్తున్నారు.ఈ పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ మేరకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి ఆర్వో (రివర్స్ ఆస్మాసిస్) ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పరిశుభ్రత కోసం ఆధునిక మరుగుదొడ్లు, చేతులు కడుక్కోవడానికి ప్రత్యేక పాయింట్లను నిర్మిస్తున్నారు. బాలికల సౌకర్యం కోసం వారికి అవసరమైన శానిటరీ ప్యాడ్లను అందుబాటులో ఉంచుతున్నారు. వీటిని సులభంగా పొందేందుకు వెండింగ్ మెషీన్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకోవడానికి, పాఠాలు చెప్పడానికి అవసరమైన ఫర్నిచర్‌ను అందిస్తున్నారు.పాఠశాలల్లో సైన్స్ విద్యను ప్రోత్సహించడానికి, భౌతిక, రసాయన, జీవశాస్త్ర ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రయోగశాలల్లో విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలు చేసి, సైన్స్ విషయాలను లోతుగా అర్థం చేసుకోగలుగుతారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి, పాఠశాలలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నారు. తరగతి గదుల్లోనే కాకుండా, పాఠశాల ప్రాంగణంలో ఎక్కడైనా ఇంటర్నెట్ ఉపయోగించుకోవచ్చు. విద్యార్థుల భద్రత కోసం, పాఠశాలల్లో అన్ని చోట్లా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, స్మార్ట్ తరగతి గదులు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. స్మార్ట్ తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, ప్రొజెక్టర్లు వంటి ఆధునిక పరికరాలు ఉంటాయి. విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉండే గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారుశారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. ఆట స్థలాలను అభివృద్ధి చేసి, విద్యార్థులు ఆడుకోవడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. బాలికలకు తమను తాము రక్షించుకోవడానికి ఆత్మరక్షణ శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో మంచి కెరీర్ ఎంచుకోవడానికి, పిల్లలకు అవసరమైన కౌన్సెలింగ్‌ను అందిస్తున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్స్, గైడ్స్ కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల బ్యాండ్లు, సంగీతం వంటి కళల్లో కూడా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే పీఎంశ్రీ స్కూళ్లలో కార్పొరేట్ బడులకు దీటుగా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు అధికారులు.

### రాయసముద్రం చెరువును పరిశీలించిన హైడ్రా రంగనాథ్

పటాన్ చెరు:రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రాయసముద్రం చెరువు సుందరీకరణ పనులపై బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం తీరుపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నాడు సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. రాయసముద్రం చెరువు సుందరీకరణ పనులు ఏళ్ల తరబడి పెండింగ్లో ఉండటంపై ఆయన

# పార్టీనే సొంతిల్లు..కార్యకర్తలతో నారా లోకేష్

గుంటూరు,తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీ అనేది సొంతిల్లు వంటిదని, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిదని అభివర్ణించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమితులైన పార్లమెంట్ కమిటీల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయానికి తగిన సమయం కేటాయించాలని లోకేశ్ సూచించారు. "పార్టీ మన సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. చంద్రబాబు గారికి ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికి ఒకసారి పార్టీ ఆఫీసుకు వచ్చి కార్యకర్తలను కలుస్తున్నారు, శిక్షణ కార్యక్రమాలకు హాజరవుతున్నారు" అని గుర్తుచేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. కేంద్ర సహకారంతోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగామని, అమరావతి, పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు.పార్టీ నాయకులు చిన్న చిన్న అలకలు వీడి ఐక్యంగా పనిచేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ఇప్పుడు అలకల వల్ల మనమే నష్టపోతాం. ఏదైనా సమస్య ఉంటే పార్టీలోనే పోరాడాలి" అని హితవు పలికారు. కనీసం 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగితేనే రాష్ట్రాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసుకోగలమని పవన్ కల్యాణ్ కూడా చెప్పారని గుర్తుచేశారు. కూటమిలో చిన్న చిన్న సమస్యలు సహజమని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగాలన్నారు. మన మధ్య విభేదాలు సృష్టించడానికి వైసీపీ ప్రయత్నిస్తుందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.వ్యక్తులు శాశ్వతం కాదని, తెలుగుదేశం పార్టీయే శాశ్వతమని లోకేశ్ స్పష్టం చేశారు. "ఒక వ్యవస్థ కింద మనం అందరం నడుచుకోవాలి. పదవిని బాధ్యతగా స్వీకరించాలి. పార్టీ వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఒక కార్యకర్తగా పనిచేస్తున్నా" అని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, పార్టీ కార్యక్రమాలను 'మై టీడీపీ యాప్' ద్వారానే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు నిరంతర ప్రక్రియ అని, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అనంతరం, ఆయన స్వయంగా శిక్షణ తరగతులకు హాజరై, వెనుక వరుసలో కూర్చుని ఒక నిత్య విద్యార్థిలా పాఠాలు వినడం అందరినీ ఆకట్టుకుంది.అంతకుముందు, వర్క్‌షాప్‌కు హాజరైన పార్లమెంట్ కమిటీ సభ్యులకు మంత్రి లోకేశ్ స్వయంగా ఎదురెళ్లి స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వారితో ఫోటోలు దిగారు. ఇదే సమయంలో, నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్రకు మూడేళ్లు

నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర ప్రారంభించి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయం పార్టీ



కార్యాలయానికి చేరుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్‌తో కేక్ కట్ చేయించి సంబరాలు జరిపారు. ఏపీ రాజకీయాల్లో యువగళం పాదయాత్ర గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని నేతలు కొనియాడారు. రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిబింబంగా ప్రజా చైతన్యమే లక్ష్యంగా యువగళం సాగిందని నేతలు గుర్తు చేసుకున్నారు. 2023 జనవరి 27న కుప్పంలో శ్రీ వరదరాజస్వామి పాదాల చెంత ప్రారంభమైన యువగళం పాదయాత్ర, 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మున్సిపాలిటీలు,మండలాలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజుల పాటు 3,132 కిలోమీటర్ల మేర కొనసాగింది. లోకేశ్ పాదయాత్ర జరిగిన 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఈ యాత్ర ప్రభావానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, సోమిరెడ్డి, యార్లగడ్డ వెంకట్రావు, ఉగ్ర నరసింహారెడ్డి, గణబాబు, ఆదిరెడ్డి వాసు, ఎంఎస్ రాజు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, వేపాడ, గ్రీష్మ, కార్పొరేషన్ ఛైర్మన్లు తదితరులు లోకేశ్‌కు అభినందనలు తెలిపారు.

బండ్ల గణేశ్ కు ఫోన్

సినీ నిర్మాత బండ్ల గణేశ్‌ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. శ్రీవారి మొక్కు తీర్చుకునేందుకు తిరుమలకు పాదయాత్ర (సంకల్ప యాత్ర) చేపట్టిన బండ్ల గణేశ్ కాలి నొప్పి కారణంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న లోకేశ్ ఆయనతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పాదయాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి త్వరగా కోలుకుని మొక్కు పూర్తి చేయాలని ఆకాంక్షించారు. వైసీపీ హయాంలో టీడీపీ అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టైన సమయంలో తాను తిరుమల వెంకన్నకు మొక్కుకున్నానని బండ్ల గణేశ్ తెలిపారు. అనంతరం చంద్రబాబు జైలు నుంచి విడుదలై ఎన్నికల్లో విజయం సాధించి మరోసారి సీఎం పదవిని చేపట్టడంతో, ఆ మొక్కును తీర్చుకునేందుకే ఈ నెల 19న షాద్‌నగర్‌లోని తన నివాసం నుంచి బండ్ల గణేశ్ సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్రను చేపట్టారు. కాలినడకన తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకొని మొక్కు తీర్చుకుంటానని ఆయన తెలిపారు. ప్రస్తుతం బండ్ల గణేశ్ పాదయాత్ర కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. పాదయాత్రలో బండ్ల గణేశ్‌కు మార్గమధ్యలో టీడీపీ అభిమానులు, నేతలు స్వాగతం పలుకుతూ మద్దతు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో లోకేశ్ ఫోన్ చేసి గణేశ్‌ను పరామర్శించారు.

# జెండా పండుగకు దూరంగా జగన్



విజయవాడ, రాజకీయాల్లో గెలుపోటములు సహజం, కానీ రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నప్పుడు ఆ వ్యవస్థల పట్ల ప్రదర్శించే గౌరవం ఒక నాయకుడి పరిణతిని తెలియజేస్తుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి విషయంలో ఇప్పుడు ఇదే అంశం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా జాతీయ పండుగలు, అసెంబ్లీ సమావేశాల పట్ల ఆయన అనుసరిస్తున్న వైఖరి రాజకీయ విశ్లేషకుల్లోనే కాక, సామాన్య ప్రజల్లో కూడా విస్మయాన్ని కలిగిస్తోంది. సాధారణంగా ఏ రాజకీయ పార్టీ అధ్యక్షుడైనా రాజ్యాంగపరమైనజాతీయ పండుగలను ఒక పవిత్ర కార్యంగా భావిస్తారు. అధికారంలో ఉన్నా లేకున్నా, పార్టీ కార్యాలయంలోనో లేదా తన నివాసంలోనో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం ఒక సంప్రదాయం. అయితే, జగన్మోహన్ రెడ్డి గత కొంతకాలంగా స్వతంత్ర , గణతంత్ర దినోత్సవ వేడుకలకు దూరంగా ఉంటున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. 2025 ,ప్రస్తుత 2026 గణతంత్ర దినోత్సవ వేడుకల సమయంలో కూడా ఆయన బహిరంగంగా జెండా ఎగురవేసిన దాఖలాలు లేకపోవడం, కేవలం సోషల్ మీడియా సందేశాలకే పరిమితమవ్వడం ఆయన  జాతీయతా భావం పై ప్రశ్నలు లేవనెత్తుతోంది.రాజ్యాంగం కల్పించిన హక్కులతో ముఖ్యమంత్రిగా పనిచేసిన ఒక నాయకుడు, అదే రాజ్యాంగం నిర్దేశించిన విధులను పాటించడంలో విఫలమవుతున్నారనే వాదన వినిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో అసెంబ్లీ అనేది ప్రజల గొంతుక. ఎన్నికల్లో గెలిచిన ప్రతి ఎమ్మెల్యేకు సభకు హాజరై ప్రజల పక్షాన నిలబడాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ, తనకు  ప్రతిపక్ష హోదా ఇవ్వలేదనే కారణంతో జగన్ అసెంబ్లీని బహిష్కరించడం, రాజ్యాంగబద్ధమైన బాధ్యత కంటే రాజకీయ హోదాకే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని సూచిస్తోంది."హోదా ఉంటేనే వస్తాను.. లేకపోతే రాను" అనే మొండి వైఖరి ఒక బాధ్యతాయుతమైన నాయకుడికి తగదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు కూడా అసెంబ్లీని బహిష్కరించిన సందర్భం ఉన్నప్పటికీ, అది ఒక శపథం రూపంలో జరిగింది. కానీ జగన్ విషయంలో, కేవలం మాట్లాడేందుకు తగిన సమయం దొరకదనే సాకుతో సభకు రాకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శలు వస్తున్నాయి. కేవలం అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే రాజ్యాంగ విలువలు గుర్తుకు వస్తాయా? అనే ప్రశ్న ఇక్కడ ఉదయిస్తోంది. ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది కేవలం ముఖ్యమంత్రిగా చూడటానికే కాదు, ఓడిపోతే ప్రతిపక్షంలో ఉండి పోరాడటానికి కూడా. 11 మంది ఎమ్మెల్యేలతోనైనా సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఆ వేదికను వదిలేసి రోడ్లపై పోరాడతామనడం లేదా మీడియా ముందుకు రావడం ప్రజలు ఇచ్చిన తీర్పును అగౌరవపరచడమే అవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాజ్యాంగం ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్న ఒక నాయకుడు, అదే రాజ్యాంగ చిహ్నాలైన జాతీయ జెండా, అసెంబ్లీ పట్ల ఇంత ఉదాసీనంగా ఉండటం ప్రజల్లో తప్పుడు సంకేతాలను పంపుతోంది. ఒక పార్టీ అధ్యక్షుడిగా తన కార్యకర్తలకు ఆయన ఏం సందేశం ఇస్తున్నారు? వ్యవస్థల పట్ల గౌరవం లేని నాయకత్వం భవిష్యత్తులో ప్రజాస్వామ్యాన్ని ఎలా కాపాడుతుంది? అనే చర్చ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్ జగన్ ఈ విషయంలో ప్రజాకోణంలో ఆలోచించాలన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# మేడారంలో బస్ స్టాండ్

వరంగల్, మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర భక్తుల కోసం రవాణా శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ములుగు జిల్లా మేడారంలో శాశ్వత బస్టాండ్ నిర్మిస్తామని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ప్రకటించారు. జాతర కోసం ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో 50 ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. భక్తుల రద్దీని తట్టుకునేందుకు 4 వేల ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తెచ్చారు, ఇవి ప్రయాణికులను నేరుగా గద్దెల సమీపం వరకు తీసుకెళ్తాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం మేడారం బస్సులకు కూడా వర్తిస్తుంది. అదనంగా.. ములుగులో రూ.5 కోట్లతో బస్టాండ్, ఏటూరునాగారంలో రూ.7 కోట్లతో బస్ డిపో నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం రవాణా శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ములుగు జిల్లా మేడారంలో పర్యటించిన రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ , పంచాయతీరాజ్ మంత్రి సీతక్క వనదేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల రవాణా సౌకర్యాల కోసం ఆర్టీసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌ను వారు ప్రారంభించారు. మేడారం జాతర సమయంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ ప్రతి ఏటా తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేస్తోంది. అయితే.. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మేడారంలో శాశ్వత బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జాతర కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌లో భక్తుల సౌకర్యార్థం 50 ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు.దీనివల్ల ప్రయాణికులు తోపులాట లేకుండా క్రమపద్ధతిలో బస్సుల కోసం వేచి ఉండవచ్చు. ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే జాతర కోసం ప్రాథమికంగా 4 వేల బస్సులను కేటాయించారు. భక్తుల రద్దీ పెరిగితే ఈ సంఖ్యను మరింత పెంచుతామని మంత్రి తెలిపారు. సాధారణంగా జాతర సమయంలో వాహనాలను దూరంగా నిలిపివేస్తారు.. కానీ ఆర్టీసీ బస్సులను మాత్రం భక్తుల సౌకర్యార్థం గద్దెల సమీపం వరకు అనుమతిస్తారు.మేడారం పరిసర ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేయడానికి ములుగులో రూ. 5 కోట్లతో అత్యాధునిక బస్టాండ్‌ను, ఏటూరునాగారంలో రూ. 7 కోట్లతో కొత్త బస్‌డిపోను నిర్మిస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మేడారం జాతరకు వచ్చే మహిళా భక్తులకు కూడా వర్తిస్తుంది. అంటే మహిళలు ఉచితంగా బస్సుల్లో మేడారం చేరుకోవచ్చు. మరోవైపు.. మేడారంలో భక్తులు అమ్మవార్లకు సమర్పించే బెల్లం (బంగారం) విషయంలో కొన్ని ఆంక్షలు అమలులో ఉన్నాయి.గుడుంబా తయారీకి బెల్లం తరలిపోకుండా ఉండాలని ఎక్సైజ్ అధికారులు ఆధార్ కార్డు వివరాలు అడుగుతున్నారు. దీనివల్ల కొన్ని చోట్ల భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత శనివారం ఒక్కరోజే సుమారు 2 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకోవడం జాతర విశిష్టతను చాటుతోంది. ములుగులోని గిరిజన విశ్వవిద్యాలయం ఈ జాతరపై సమగ్ర పరిశోధన చేయాలని నిర్ణయించింది.

# కేదార్‌నాథ్,బద్రీనాథ్ ఎంట్రీ ఫర్ హిందూస్ ఓన్లీ



న్యూఢిల్లీ, ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ ప్రవేశాలపై కీలక ప్రకటన వెలువడింది. ఈ రెండు ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించాలని బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతిపాదించింది. మతపరమైన సంప్రదాయాలను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కమిటీ ఛైర్మన్ తెలిపారు. విశ్వాస కేంద్రాలైన ఈ ధామ్‌లలోకి తమ విశ్వాసాన్ని గౌరవించేవారినే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన త్వరలో బోర్డు ముందుంచనున్నారు. దీనికి బోర్డు ఆమోదం లభిస్తుందని భావిస్తున్నారు.దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్ , బద్రీనాథ్ ఆలయాల్లోకి ఇకపై కేవలం హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. హిందువులు కాని వారు ఈ ఆలయాల్లోకి ప్రవేశించడానికి వీలు లేకుండా నిషేధం విధించాలని.. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతిపాదించింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ బీకేటీసీ ఛైర్మన్ ధ్రువీకరించారు. హరిద్వార్‌లోని కుంభమేళా ప్రాంతంలో 105 ఘాట్‌లలో హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించాలని ప్రతిపాదన వచ్చిన కొద్ది రోజులకే ఈ ప్రకటన రావడం గమనార్హం.బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలతో పాటు.. బీకేటీసీ పరిధిలోకి వచ్చే మరో 47 ఆలయాల్లో కూడా హిందువులు కాని వారిని ప్రవేశించకుండా నిషేధం విధించేలా చర్యలు తీసుకోవాలని ఆలోచిస్తోంది. ఈ ప్రతిపాదనను త్వరలో బీకేటీసీ బోర్డు ముందు ఉంచే అవకాశం ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, చాలా మంది భాగస్వాములు దీనికి మద్దతు ఇస్తున్నారు.బీకేటీసీ ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, హిందువులు కానివారిని నిషేధించాలనే ప్రతిపాదన చాలా కాలం నుంచి ఉందని తెలిపారు. “దీనిని ఆదిశంకరాచార్యుల కాలం నుంచీ పాటిస్తున్నారు. మతపరమైన సంప్రదాయాలను కాపాడుకోవడంలో తప్పులేదని మేము భావిస్తున్నాము,” అన్నారు. “చారిత్రాత్మకంగా, హిందువులు కాని వారి ప్రవేశం ఆలయాలలో నిషేధించబడింది,” అని ఆయన తెలిపారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ని ఉటంకిస్తూ, మతపరమైన వర్గాలకు తమ వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు ఉందని, కాబట్టి ఈ నిర్ణయం తీసుకోవడానికి కమిటీకి పూర్తి హక్కు ఉందని ఆయన స్పష్టం చేశారు. “హిందువులు కానివారు” అనే పదాన్ని తప్పుగా అర్థం చేసుకోకూడదని కూడా ఆయన స్పష్టం చేశారు. “మా విశ్వాసాన్ని గౌరవించేవారు స్వాగతించబడతారు. ఈ ధామ్‌లు పర్యాటక కేంద్రాలు కావు, అవి విశ్వాస కేంద్రాలు,” అని ఆయన పేర్కొన్నారు.ఇదిలా ఉండగా.. ఉత్తరాఖండ్ ప్రభుత్వం హరిద్వార్‌లోని 105 ఘాట్‌లలో హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించడం గురించి ఆలోచిస్తోంది. అలాగే, హరిద్వార్, రిషికేశ్‌లను ‘సనాతన పవిత్ర నగరం’గా ప్రకటించాలని కూడా పరిశీలిస్తోంది. హరిద్వార్ అర్ధ కుంభమేళాతో ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని, 1916లో గంగా సభ వ్యవస్థాపకుడు మదన్ మోహన్ మాలవ్యతో జరిగిన ఒప్పందంలోని నిబంధనలను కూడా దీనికి ఉపయోగించుకోవచ్చని వర్గాలు తెలిపాయి.ఈ ప్రతిపాదనలు భక్తులలో చర్చనీయాంశంగా మారాయి. ఆలయాల పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ఇది పర్యాటకులను, ఇతర మతాల వారిని ఎలా ప్రభావితం చేస్తుందో చూడాలి. ఈ విషయంలో భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## వారానికి 5 రోజులు పని కావాలి




ముంబై, వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం సమ్మెకు దిగారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు జరిగిన ఈ సమ్మెతో బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్కు క్లియరెన్సులు వంటి రోజువారీ లావాదేవీలు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.దేశంలోని దాదాపు అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. గుజరాత్‌లోని వడోదర, పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్, ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ సహా అనేక నగరాల్లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఐదు రోజుల పని విధానం కోసం ప్రభుత్వానికి చాలాసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు.”ఈరోజు సమ్మెలో దేశవ్యాప్తంగా 8 లక్షల మందికి పైగా ఉద్యోగులు పాల్గొంటున్నారు. 2015 నుంచి మా డిమాండ్ పెండింగ్‌లోనే ఉంది. ఎల్ఐసీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే వారానికి 5 రోజుల పనివిధానం అమలవుతోంది. బ్యాంకుల్లోనూ అమలు చేస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు” అని ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో జరిగిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఆరు నెలల్లోనే 5 రోజుల పనిదినాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండేళ్లు గడిచినా ఆ హామీ నెరవేరలేదని పాట్నాలో ఉద్యోగులు తెలిపారు. “ఆర్‌బీఐ, నాబార్డ్, సెబీ వంటి సంస్థలన్నీ 5 రోజులే పనిచేస్తున్నాయి. మాకు మాత్రం ఎందుకు అమలు చేయడం లేదు?” అని వారు ప్రశ్నించారు. యూపీలోని ఘాజీపూర్ జిల్లాలో దాదాపు 250 బ్యాంకులకు చెందిన 10,000 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో సుమారు రూ.150 కోట్ల విలువైన లావాదేవీలు నిలిచిపోయాయి. ప్రభుత్వ హామీ నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి.

# బీఆర్ఎస్ లోకి అరూరి పునరాగమనంలో ఆంతర్యం!?

హైదరాబాద్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, తాజా మాజీ బీజేపీ నాయకుడు అరూరి రమేష్ తిరిగి బీఆరస్ లో చేరడం వెనుక అంతర్యమేమిటనేది ఆసక్తికరంగా మారింది. లోక్ సభ ఎన్నికలకు ముందు బీఆరస్ కు రాజీనామా చేసి బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన అరూరి రమేష్ రెండేళ్ళ తర్వాత ఆకస్మికంగా ‘తన ఇంటి పార్టీ’ అంటూ బీఆర్ ఎస్ లో చేరేందుకు సిద్ధం కావడం వెనుక ఏదో మతలబు ఉందంటున్నారు. మరోవైపు ఆయన బీజేపీలో ఇమడలేకపోయారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా బీఆర?స్ అధిష్టానం ఆహ్వానం మేరకే తాను తిరిగి ఆ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించడం విశేషం.స్థానికేతరుడు అయినప్పటికీ, అప్పటి టీఆర?స్ వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జ్, పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన ఉద్యమకారుడు పసునూరి దయాకర్ ను కాదని అరూరి రమేష్ కు ఎస్సీ రిజర్వుడు ఈ స్థానంలో అప్పటి టీఆర?స్ అవకాశం కల్పించింది. పైగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత వచ్చిన తొలి ఎన్నికల్లో ఈ ఛాన్స్ కల్పించారు. దీంతో అరూరి ఎమ్మెల్యేగా పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. అక్కడి నుంచే రెండవ పర్యాయం కూడా పెద్ద మెజార్టీతో గెలుపొందారు. మూడవసారి కూడా పార్టీ పోటీకి అవకాశం ఇస్తే అనూహ్యంగా ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు చేతిలో ఓడిపోయారు. ఈ మధ్యకాలంలో అరూరి పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. నియోజకవర్గంలో అనేక భూములు కబ్జా చేశారని విపక్షాలతోపాటు వివిధ ప్రసార మాధ్యమాల్లో విపరీత ప్రచారం సాగింది. వీటితో పాటు కొన్ని నైతికపరమైన అంశాలపై కూడా జోరుగా ఆరోపణలు వచ్చాయి. కారణాలేవైనా ఆయన ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత వచ్చిన లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీ అభ్యర్థిత్వాన్ని అరూరి ఆశించారు. బీఆర?స్ అధిష్టానం సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ తో పాటు అరూరి రమేష్ కు టికెట్ ఇవ్వకుండా కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కావ్యను బీఆరస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో అరూరి బీజేపీలో చేరిపోయారు.అయితే రాజకీయ పరిణామాల నేపథ్యంలో కడియం కాంగ్రెస్ లో చేరడం,కావ్య టికెట్ నిరాకరించడంతో మరొకరికి అవకాశం లభించింది.లోక్ సభ ఎన్నికల సందర్భంగా కడియం పై అరూరి తీవ్ర విమర్శలు చేశారు. తాజాగా రెండేళ్ళ తర్వాత అరూరి తిరిగి బీఆరస్ లో చేరడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా కొద్ది రోజుల క్రితమే బీజేపీకి చెందిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా కూడా రమేష్ హడావిడి చేశారు. ఈ కొద్ది కాలంలోనే ఆయన తిరిగి బీఆరస్ లో చేరేందుకు నిర్ణయించుకోవడం, ఈ మధ్యలో జరిగిన మార్పులేమిటని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. త్వరలో మునిసిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆయన తిరిగి బీఆరస్ గూటికి చేరాలని నిర్ణయించుకోవడం గమనార్హం.

అరూరి ఆగమనంలో అంతర్యం?

ఆరూరి రమేష్ బీఆరస్ కు రాజీనామా చేసినప్పటి నుంచి ఆ పార్టీ వర్ధన్నపేటనియోజకవర్గానికి ఎవరిని నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించలేదు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన వర్ధన్నపేట ఇన్చార్జి బాధ్యతలను ఆరూరి రాజీనామా చేసినప్పటి నుంచి మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నిర్వహిస్తున్నారు. తాజాగా ఆరూరి తిరిగి బీఆరస్ లో చేరడంతో వర్ధన్నపేట ఇన్చార్జి బాధ్యతలు తిరిగి ఆయనకు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు.




ఉప ఎన్నికలొస్తే ఆయనే అభ్యర్థా?

స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పుగల్లు ఆరూరి సొంత ఊరు. కాంట్రాక్టరుగా, టిడిపి నాయకునిగా ఆ ప్రాంతంలో కడియం అనుచరుడిగా పనిచేశారు. ఆ తరువాత జరిగిన రాజకీయ పరిణామాల్లో టిడిపికి రాజీనామా చేసి ప్రజారాజ్యం పార్టీలో చేరారు. స్టేషన్ ఘన్ పూర్ నుంచి పీఆర్పీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన గత చరిత్ర కూడా ఆరూరికి ఉంది. తాజాగా స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర?స్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరిన విషయం తెలిసిందే. కడియం పార్టీ మారిన అంశం ప్రస్తుతం శాసనసభ స్పీకర్ పరిధిలో ఉంది. కడియం పై అనర్హత వేటువేయకముందే ఆయన రాజీనామా చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో ఒక చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో అనూహ్య పరిణామాల నేపథ్యంలో కడియం ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తే స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ స్థానం నుంచి ఆరూరికి ఏమైనా బీఆర?స్ అవకాశం కలిపిస్తుందా? అనే చర్చ అప్పుడే ప్రారంభమైంది. ఈ స్థానం కూడా ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడం గమనార్హం. ఉప ఎన్నిక వస్తే ఈ స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు కేటాయిస్తారా లేదా అని అనుమానాలు ఆ పార్టీతో పాటు రాజకీయ వర్గాల్లోనూ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే గా ఉన్న రాజయ్యను కాదని కడియం శ్రీహరికి అవకాశం ఇచ్చిన విషయం గమనార్హం. కడియానికి ధీటైన అభ్యర్థిగా, ఆర్థికంగా బలంగా ఉన్న అరూరి అయితే బాగుంటుందనే ముందస్తు ప్రణాళికలో భాగంగా అరూరికి ఒక ఛాన్స్ ఇచ్చే ఛాన్స్ లేకపోలేదు అంటున్నారు. ఈ కారణంగానే అరూరిని బీఆర్ఎస్ లో చేర్చుకునేందుకు సిద్ధమైనట్లు ఒక చర్చ సాగుతోంది. ఇదే జరిగితే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ స్థానంలో టికెట్ దక్కని రాజయ్య పరిస్థితి దయనీయంగా మారే అవకాశం ఉందంటున్నారు. స్టేషన్ ఉప ఎన్నిక వస్తోందనీ, తానే పోటీ చేసి గెలుస్తనని రాజయ్య గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ స్థితిలో అరూరి చేరిక రాజయ్యకు చెక్ పెట్టేందుకేననే ఒక చర్చ సాగుతోంది. ఇప్పటికే కడియం కూడా రాజయ్యకు గతంలోనే బీఆర?స్ అధిష్టానం మొండిచెయ్యి ఇచ్చారని, ఈ సారి కూడా అదే జరుగుతోందని ప్రచారం చేస్తున్నారు. ఈ స్థితిలో అరూరి రాకతో అనుమానాలు పెరుగుతున్నాయి. ఇదిలా ఉండగా అరూరి పై గతంలో అనేక ఆరోపణలు రాగా, మరోసారి ఈ సందర్భంగా తెరపైకి వచ్చే అవకాశం ఉందనీ, మూడు పార్టీలు మారిన ఆయన బీఆరస్ ను

# మున్సి‘పోల్స్’లో కాంగ్రెస్,బీఆర్ఎస్ మధ్యే పోటీ బీజేపీ నామమాత్రమేనా




హైదరాబాద్:రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు నగారా మోగింది. జనవరి 28వ తేదీ బుధవారం ఉదయం 1.30 గంటల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్ జరుగుతుండగా, 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలు ప్రకటించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 116 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం ఓటర్లు 52,43,000 ఉండగా, అందులో పురుష ఓటర్లు 25,62,000, మహిళా ఓటర్లు 26,80,000. ఫిబ్రవరి 16వ తేదీన మునిసిపాలిటీ ఛైర్మన్లు, కార్పొరేషన్ మేయర్ల ఎన్నిక జరుగనున్నది.తెలంగాణలోని 31 జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు అక్టోబర్ నెలలో నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం 5,5749 ఎంపీటీసీలు, 565 జెడ్పీటీసీలు, 12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆరస్ పార్టీలు మద్ధతు పలికిన అభ్యర్థులు తలపడగా, కొన్ని చోట్ల బీజేపీ మద్ధతుతో పోటీ చేసిన వారు రెండు పార్టీల అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చారు. మొత్తం సర్పంచి స్థానాలలో 6,821 కాంగ్రెస్ మద్ధతుదారులు గెలుచుకోగా, బీఆరస్ మద్ధతు ఇచ్చిన వారు 3,520 సర్పంచి స్థానాలను దక్కించుకున్నది. కేవలం 703 సర్పంచి పదవులను బీజేపీ మద్ధతుదారులు కైవసం చేసుకున్నారు. తొలి విడతలో ఎక్కువగా 395 సర్పంచ్? ఏకగ్రీవాలు అధికార కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడ్డాయి. నువ్వా నేనా అనే విధంగా రెండు పార్టీల అభ్యర్థులు పోటీపడ్డారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీఆరెస్ పార్టీలు ఓటరు మొగ్గు ఎటువైపు ఉందనే విషయంలో ఇప్పటికే సర్వేలు చేయించుకున్నట్టు తెలుస్తున్నది. పట్టణంలో ఎన్ని వార్డులు ఉన్నాయి, ఏ వార్డులలో బలహీనంగా ఉన్నాం, మెరుగయ్యేందుకు ఏం చేయాలనే దానిపై వ్యూహ, ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకున్నాయని చెబుతున్నారు. చైర్మన్?, మేయర్ స్థానాలను కైవసం చేసుకునేందుకు రెండు పార్టీలు తమదైన శైలిలో ముందుకు సాగుతున్నాయి.

స్థానిక జోష్ కాంగ్రెస్ కొనసాగించేనా?

స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాలను గెలుపొందిన జోష్?మీద ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్సిపల్? ఎన్నికల్లో కూడా మెజారిటీ సీట్లను దక్కించుకునేందుకు వ్యూహాలను సిద్ధం చేసుకున్నది. అత్యధిక స్థానాలను సాధించేందుకు లోకసభ నియోజకవర్గాలవారీగా ఇన్?చార్జ్?లను నియమించింది. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, పాత నాయకుల మధ్య విభేధాలు ఉన్నట్లు గమనించి రాష్ట్ర నాయకత్వరౌ వాటి పరిష్కారంపై దృష్టిసారించింది. రెండు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు సమావేశాలు కూడా నిర్వహించారు. గద్వాల, చేవెళ్ల, పటాన్?చెరు, జగిత్యాల, బాన్సువాడ, నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో నేతల మధ్య విభేధాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సమస్య చిన్నదే అయినా నిర్లక్ష్యం చేస్తే ఫలితాలపై ప్రభావం చూపిస్తుందని రాష్ట్ర నాయకత్వం అంచనా వేసిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రులు జిల్లా స్థాయిలో కాంగ్రెస్ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. మున్సిపల్? ఎన్నికల నేపథ్యంలో పట్టణాల్లో ఆగమేఘాల మీద అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఏకపక్షంగా ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఒక్కో వార్డు నుంచి ఐదుగురు ఔత్సాహికుల పేర్లు ఇవ్వాలని పీసీసీ నాయకత్వం ఇన్‌చార్జ్‌లకు సూచించిందని సమాచారం. సర్వే నివేదికలో వెల్లడైన పేర్ల ప్రకారం జాబితాను పంపించాలని, ఆ పేర్లను ఎమ్మెల్యే ద్వారా సిఫారసు చేయించాలని స్పష్టం చేశారు.

అభివృద్ధిని చూసి ఓటేయాలంటున్న సీఎం

సర్పంచ్? ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను రిపీట్ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దావోస్ పర్యటనకు ముందుగా జిల్లాల బాట పట్టారు. అదిలాబాద్ జిల్లా పర్యటనతో శ్రీకారం చుట్టారు. నిర్మల్ లో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న మునిసిపల్ ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఒక్క సీటు తగ్గకుండా చూసుకోవాలని, ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో మంత్రులు బాధ్యత తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో బీజేపీ వైపు ఓటర్లు మొగ్గుచూపకుండా చూడాలని ఆయన ఇన్?చార్జ్?లకు దిశా నిర్ధేశం చేశారు. అమెరికా పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిబ్రవరి 2వ తేదీన హైదరాబాద్ చేరుకోనున్నారు. మరుసటి రోజు నుంచి ఆయన రాష్ట్రంలో ఆయన సుడిగాలి పర్యటన చేసి అభ్యర్థులకు మద్ధతుగా ప్రచారం చేయనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయనతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు క్షేత్రస్థాయిలో ఉండనున్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలే బీఆరెస్ టార్గెట్?!

మున్సిపల్ ఎన్నికలపై బీఆరస్ నాయకులు ఫోకస్ పెట్టారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర?స్ మద్ధతిచ్చిన అభ్యర్థులు భారీ సంఖ్యలో గెలుపొందడంతో బీఆరస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. మున్సిపల్? ఎన్నికలకు ఎప్పుడైనా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండడంతో రెండు రోజుల క్రితం పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ తో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టీ.హరీశ్ రావు ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయిలో సన్నద్ధం చేయాలని అధినేత ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు చేయకుండా మోసం చేస్తున్న వైనాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మున్సిపల్? ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని, అందరూ సమన్వయంతో పనిచేయాలని కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. మున్సిపాల్టీల వారీగా ఇన్?చార్జ్?లను నియమించాలని ఆదేశించారు. కేసీఆర్ ఆదేశం మేరకు మూడు రోజుల క్రితం కార్పొరేషన్లు, మున్సిపాల్టీల వారీగా సమన్వయకర్తల జాబితాను కేటీఆర్ విడుదల చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం మొదలు చైర్మన్లు, మేయర్ల ఎన్నిక వరకు వీరు పార్టీ శ్రేణులు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తారని ప్రకటించారు. స్థానికంగా పరిస్థితులను అంచనా వేసి గెలుపొందే అభ్యర్థులను ఎంపిక చేయడం, బూత్ స్థాయి లో ప్రచారం పై నిమగ్నమవుతారని వెల్లడించారు.

పార్టీ మారుతున్న నేతలు

మున్సిపల్? ఎన్నికల నేపథ్యంలో పలువురు నాయకులు పార్టీలు మారుతున్నారు. బీఆరస్ నుంచి బీజేపీ వెళ్లిన నాయకులు తిరిగి బీఆరస్ గూటికి చేరుకుంటున్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బీజేపీని వీడి బీఆరస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. గత ఎన్నికల్లో వరంగల్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీలో సరైన ఆదరణ లేకపోవడంతో మనస్తాపానికి గురైన ఆయనౌ తప్పని పరిస్థితుల్లో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా ఒక ముఖ్య నేత పార్టీకి రాజీనామా చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. ఇలా పలు నియోజకవర్గాల్లో నాయకులు ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటూ అన్నట్లుగా జంప్‌చేసే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా ప్రధానంగా కాంగ్రెస్, బీఆరెస్ మధ్యే పోటీ నెలకొని ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# మారుతోన్న నగరి లెక్కలు




తిరుపతి,ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి నియోజకవర్గం లో రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది. గత ఎన్నికల సమయంలో కనిపించిన సమీకరణలకు భిన్నంగా ఇప్పుడు పరిస్థితులు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ మార్పులు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకురాలు రోజా రాజకీయ భవితవ్యంపై చర్చను మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నాయి. ఒకప్పుడు నగరి పరిసర మండలాల్లో రోజా పేరు బలంగా వినిపించేది. కానీ గత ఎన్నికలకు ముందే ఆమె ఉనికి తగ్గినట్టు కనిపించగా, ఇప్పుడు మరింత మౌనం నెలకొన్నట్టు రాజకీయ వర్గాలు మాట్లాడుకుంటున్నాయి.నగరి నియోజకవర్గంలో నింద్ర , విజయపురం , నగరి , పుత్తూరు, వడమాలపేట వంటి మండలాలు ఉన్నాయి. వీటిలో గత ఎన్నికలకు ముందు వరకు నింద్ర, వడమాలపేటల్లో రోజాకు గట్టి మద్దతు ఉందనే భావన ఉండేది. మంత్రిగా ఉన్న రోజుల్లో కూడా ఆమె ఈ రెండు మండలాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారని స్థానికులు గుర్తు చేస్తారు. తరచూ పర్యటనలు, కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఇవే తన బలం ఉన్న ప్రాంతాలుగా రోజా చెప్పుకొనేవారు.నగరి మండలంలో పరిస్థితి మాత్రం సమంగా ఉండేది. అభిమానులు ఉన్నప్పటికీ వ్యతిరేకత కూడా అంతే స్థాయిలో ఉండేది. విజయపురం, పుత్తూరులో అయితే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. అక్కడ వైసీపీ వర్గాలు రెండు గ్రూపులుగా విడిపోయాయి. ఈ పరిణామాలు గత ఎన్నికలకు ముందే మొదలయ్యాయి. అదే సమయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభావం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటం కూడా రోజాకు సవాలుగా మారింది. ఈ కారణాల వల్ల ఆమె నింద్ర, వడమాలపేటలపైనే ఎక్కువగా ఆధారపడినట్టు కనిపించింది.అయితే తాజా రాజకీయ పరిణామాలు ఈ రెండు మండలాల్లో కూడా మార్పు వస్తున్నాయనే సంకేతాలు ఇస్తున్నాయి. ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నియోజకవర్గం అంతటా చురుకుగా పర్యటిస్తున్నారు. తమకు బలం ఉన్న ప్రాంతాలతో పాటు బలహీనంగా ఉన్న మండలాలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టడం ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేయడం, సమస్యలపై వెంటనే స్పందించడం వల్ల ప్రజల్లో ఆయన పట్ల అనుకూలత పెరుగుతోందని అంటున్నారు.ఇదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కూడా ఊపందుకున్నాయి. ఈ పరిణామాల ప్రభావంతో గతంలో రోజాకు అంతో ఇంతో మద్దతు కనిపించిన నింద్ర, వడమాలపేటల్లో ఇప్పుడు ఆమె పర్యటనలకు పెద్దగా స్పందన లేకపోతున్నట్టు చర్చ సాగుతోంది. ఒకప్పుడు కనిపించిన స్వాగతాలు, హడావిడి ఇప్పుడు తగ్గినట్టు స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయిఈ మారుతున్న రాజకీయ సమీకరణలు వచ్చే ఎన్నికల నాటికి ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. నగరి నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు రోజా రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయా? లేక ఆమె మళ్లీ తన పాత బలాన్ని సమీకరించగలుగుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానం కాలమే చెప్పాల్సి ఉంది. కానీ ప్రస్తుతానికి మాత్రం నగరిలో రాజకీయ గాలి మారుతోందన్న మాట వినిపిస్తోంది.

## స్మగ్లర్లతో సంబంధాలు.. ఉద్యోగుల తొలగింపు

తిరుపతి,తిరుపతి జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్ వ్యవహారంలో అటవీశాఖ కఠిన చర్యలు చేపట్టింది. స్మగ్లర్లతో సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలు రావడంతో, ఇద్దరు అటవీశాఖ ఉద్యోగులను అటవీశాఖ ఉన్నతాధికారులు ఉద్యోగాల నుండి శాశ్వతంగా తొలగించారు. ఈ మేరకు జిల్లా అటవీశాఖ అధికారి (ఆఈూ) అధికారిక ఉత్తర్వులను విడుదల చేశారు. ఎర్రచందనం దొంగ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులే స్మగ్లర్లకు సహకరించడం శాఖాపరంగా తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించిన అధికారులు, ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.అటవీ సంపదను కాపాడటంలో నిర్లక్ష్యం వహించినా లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా ఎవరినీ సహించేది లేదని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ తొలగింపు ఉత్తర్వులు అటవీశాఖలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. స్మగ్లింగ్‌కు వ్యతిరేకంగా చేపడుతున్న నిరంతర నిఘాలో భాగంగా, లోతైన విచారణ జరిపిన అనంతరం వీరి ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభించడంతోనే ఈ వేటు వేసినట్లు సమాచారం. ఈ చర్య ద్వారా అక్రమ రవాణాకు సహకరించే ఇతర సిబ్బందికి కూడా గట్టి సంకేతాలు పంపినట్లయింది.కడప జిల్లాలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఒక్కసారిగా కలకలం సృష్టించింది. గత కొంతకాలంగా జిల్లాలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠా, తాజాగా పలు నివాసాల్లో చొరబడి భారీగా బంగారు ఆభరణాలు మరియు నగదును దోచుకెళ్లారు. తాళం వేసి ఉన్న ఇళ్లే కాకుండా, జన సమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో కూడా ఈ దొంగతనాలు జరగడం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. ఈ ముఠా సభ్యులు అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తూ పోలీసుల కళ్లుగప్పి వరుస చోరీలకు పాల్పడుతున్నారు.దొంగతనాలను అరికట్టే క్రమంలో భాగంగా గస్తీ నిర్వహిస్తున్న పోలీసులపై కూడా ఈ ముఠా తెగబడింది. విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ ఈ దొంగలను అడ్డుకునే ప్రయత్నం చేయగా, దుండగులు ఆయనపై రాయితో తీవ్రంగా దాడి చేశారు. ఈ దాడిలో కానిస్టేబుల్ తలకు బలమైన గాయాలు కావడంతో, తోటి సిబ్బంది ఆయన్ని వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దిగారు.

## ఇద్దరు చైన్ స్నాచర్లు అరెస్టు

హైదరాబాద్:గత 10 రోజుల క్రితం చైతన్య పురి,నాగోల్, హయత్ నగర్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో జరిగిన వరుస స్నాచింగ్ కేసు లను చైతన్య పురి పోలీసులు ఛేదించారు. నిందితులనుంచి 5.2 తులాల బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎల్బీనగర్ డిసిపి అనురాధ తెలిపారు. న్యూ ఢిల్లీకి చెందిన అంతర్ రాష్ట్ర స్నాచింగ్ ముఠా సభ్యుడు అక్షయ్ కుమార్ శర్మ, హర్యానా కి చెందిన రోహిత్ ను అరెస్ట్ చేయటం జరిగింది. ప్రదాన నిందితుడు పై న్యూ ఢిల్లీ లో 21 కేసులు నమోదు అవ్వగా మరో నిందితుడు రోహిత్ పై న్యూ ఢిల్లీ మరియు మహారాష్ట్రలో 13 కేస్ లు నమోదయ్యాయి. ఇద్దరు నిందితులపై హైదరాబాద్ , మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో గత ఆరునెలలో

# లోకేష్ కు,పవన్ కు ప్రమోషన్



విజయవాడ, జనవరి 28,ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. మరో నెలలో రెండేళ్ల పాలన పూర్తవుతుంది. ఇప్పటివరకు సజావుగా పూర్తి చేసామన్న సంతృప్తి కూటమిలో ఉంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని చెబుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయ నిర్ణయాల దిశగా కూటమి ముందుకు వెళ్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. మంత్రి నారా లోకేష్ ప్రమోషన్, పట్టాభిషేకం వంటి ప్రచారం సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. ఇటువంటి తరుణంలో పవన్ పాత్ర ఎలా ఉండబోతుంది అనేది చర్చ. ఒకవేళ లోకేష్ కు ప్రమోషన్ కల్పించాలంటే పవన్ నుంచి అభ్యంతరం రాదా? అనే చర్చ కూడా బలంగా సాగుతోంది. అయితే ఏది ఏమైనా మూడు పార్టీలు కలిసి ముందుకెళ్లాలని బలంగా నిర్ణయించుకున్నాయి. అందుకే కూటమి అంతర్గత నిర్ణయాలు సైతం మూడు పార్టీల మధ్య జరగాలన్నది ఒక ప్రతిపాదనగా ఉన్నట్లు తెలుస్తోంది. 2027 ద్వితీయార్థంలో మంత్రి నారా లోకేష్ ప్రమోషన్ ఉంటుందన్న చర్చ నడుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవితో పాటు డిప్యూటీ సీఎం హోదా కల్పిస్తారని టాక్ నడుస్తోంది. కానీ ఇప్పటికే పార్టీ పై పూర్తిస్థాయిలో పట్టు సాధించారు లోకేష్. ఆపై తన మంత్రి పదవి విషయంలో సైతం సక్సెస్ అయ్యారు. పెట్టుబడుల సాధన, పరిశ్రమల ఏర్పాటు వంటి విషయంలో విజయం సాధించారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. అదే సమయంలో బిజెపి అగ్ర నేతల ఆశీస్సులు కూడా అందుకున్నారు. వారి అభిమానాన్ని చూరగొన్నారు. అయితే ఏకంగా లోకేష్ కు ముఖ్యమంత్రి పదవి కట్ట పెడతారన్న ప్రచారం నడుస్తోంది. అయితే అంతటి సాహసానికి దిగుతారా అనేది చర్చ. ఎందుకంటే అమరావతి రాజధానిని ప్రాధాన్యత ప్రాజెక్టుగా తీసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థల ఏర్పాటు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికార మార్పిడి జరిపితే దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. అందుకే ఇందులో ఎంత మాత్రం నిజం లేదని తెలుస్తోంది.రాష్ట్రంలో లోకేష్ ప్రమోషన్, పవన్ కళ్యాణ్ కు ప్రత్యామ్నాయ అవకాశాలు జరగాలంటే 2029 ఎన్నికల తరువాతే. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఏపీలో మంత్రిగా ఉన్నారు. ఆపై డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగుతున్నారు. మరోవైపు సనాతన ధర్మం అంటూ జాతీయ స్థాయిలో సైతం ప్రభావం చూపుతున్నారు. తరచూ వివిధ రాష్ట్రాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో సైతం వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో పవన్ కళ్యాణ్ ద్వారా రాజకీయం చేయాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. ఈ పరిస్థితులు చూస్తుంటే 2029 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేసి కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. కేంద్ర క్యాబినెట్ లో కీలక బాధ్యతలు కట్టబెట్టి జాతీయస్థాయి రాజకీయాల కోసం పవన్ కళ్యాణ్ ను వాడుకుంటారు అన్న చర్చ జోరుగా సాగుతోంది. 2029 సార్వత్రిక ఎన్నికలతోపార్టీ ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. మూడు పార్టీలు ఉమ్మడిగా ముందుకు వెళ్తాయి. పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేస్తారు. లోకేష్ తిరిగి అసెంబ్లీకి పోటీ చేస్తారు. కూటమి తప్పకుండా అధికారంలోకి వస్తుందన్న నమ్మకం వారిలో ఉంది. అప్పుడు కూడా చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టడం ఖాయం. కేంద్రంలో పవన్ కళ్యాణ్ తిరుగులేని శక్తిగా ఉంటారు. ఏపీలో కూటమికి రక్షణ కవచంగా నిలుస్తారు. అటువంటి సమయంలో చంద్రబాబు వయసు దృష్ట్యా సీఎం పదవి నుంచి తప్పుకుంటే లోకేష్ కు పట్టాభిషేకం చేయడం ఖాయం. కేంద్ర పెద్దల భరోసాతో, పవన్ కళ్యాణ్ సమ్మతితో ఇది జరిగే అవకాశం ఉంది. అంటే రాష్ట్రంలో పదవుల మార్పు అనేది 2029 ఎన్నికల్లో విజయాలను అనుసరించి ఉంటుంది. అంతవరకు ఎటువంటి మార్పు ఉండదు అన్నది విశ్లేషకుల మాట. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# బెంగాల్ పై కమలం గురి...

న్యూఢిల్లీ, 2026లో జరిగే ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో బీజేపీకి అత్యంత కీలకమైన రాష్ట్రం పశ్చిమ బెంగాల్. 2021లో బీజేపీ కేవలం 76 సీట్ల వద్దనే ఆగిపోయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ తీవ్రంగా పోరాడింది. సీఎం మమతా బెనర్జీని ఓడించింది. కానీ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సీట్లు సాధించలేదు. 15 ఏళ్లుగా బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉంది. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ముస్లిం ఓటర్లకు అండగా ఉంటూ హిందువులకు దూరంగా ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ అధికారంలోకి రావడానికి ఇదే మంచి అవకాశంగా భావిస్తోంది. జేపీ నడ్డా నేతృత్వంలో రాష్ట్ర వ్యూహం రూపొందించారు. ఈ క్రమంలో జేపీ.నడ్డా బెంగాల్ కీలక సమావేశం నిర్వహించారు. విభేదాలు తొలగించే ప్రయత్నం చేశారు. కీలక బాధ్యలు అప్పగించారు. ప్రతీ నియోజకవర్గానికి ఒక ఎంపీ లేదా సీనియర్ నాయకుడిని నియమించింది. బీజేపీ అధికారంలోకి వస్తే ఆయుష్మాన్ భారత్, జీ రామ్‌జీ అమలవుతాయి. ఈ అంశాన్ని బెంగాల్ ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఒక ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నడ్డా మార్గదర్శకత్వంలో వచ్చిన మరో కీలకం స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూలో బీజేపీ ఓట్లు తొలగకుండా చూశారు. నవంబర్ 24న బీజేపీ మొత్తం రాష్ట్రాన్ని ఐదు కీలక జోన్లుగా విభజించింది. ప్రతీ జోన్‌కు ఒక సంఘటన కార్యదర్శిని నియమించింది. వీరు స్థానిక నాయకులను కలుపుకుని విస్తృతంగా తిరుగుతూ పనిచేస్తున్నారు. ఢిల్లీ ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన పవన్ రాణాకు బెంగాల్‌లో కీలక బాధ్యతలు అప్పగించారు.ప్రతీ నియోజకవర్గానికి ఎంపీ లేదా సీనియర్ నాయకుడిని నియమించారు. రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా చేసి, ప్రతి జోన్‌కు సంఘటన కార్యదర్శి నియమించారు. ఢిల్లీ ఎన్నికల హీరో పవన్ రాణాను బెంగాల్‌లో బాధ్యతలు ఇచ్చారు. కోల్‌కతా, దక్షిణ బెంగాల్ (24 పర్గణాలు)లో సీట్లు పెంచాలని లక్ష్యం. 15 ఏళ్ల అధికారంలో మమతా ప్రభుత్వం ముస్లిం ఓట్లపై ఆధారపడి హిందువులను కంగోరు చేసిందని ఆరోపణ. విలేజ్ వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఓటర్లను ఆకర్షిస్తోంది. 2021లో బీజేపీ 76 సీట్లకు ఆగినా, ప్రభుత్వ ఏర్పాటు కలిగలేదు.ముఖ్యంగా బీజేపీ దృష్టి కోల్‌కతా, దక్షిణ బెంగాల్‌పై




ఎక్కువగా ఉంది. నార్త్, సౌత్ 24 పరగణాల్లో 64 సీట్లు ఉంటాయి. 2016లో బీజేఈ కేవలం ఒక సీటు, 2021 ఐదు సీట్లు గెలిచింది. ఇక్కడ సీట్లు పెంచాలని బీజేపీ భావిస్తోంది. కోల్‌కతా మెట్రోపాలిటన్ ఏరియాల్లో 2016, 2021లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేదు. ఈ ఏరియాను కూడా ప్రత్యేకంగా పనిచేస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ కూడా ఓటర్లను ఆకట్టుకునేందుకు విలేజ్ వలంటీర్ వ్యవస్థను అమలు చేస్తోంది. వెల్ఫేర్ కమిటీ పేరుతో వెయ్యి మందిని నియమించింది. దానిని అధిగమించి బీజేపీ అధికారంలోకి రావాలని భావిస్తోంది. ఇక కేరళ, తమిళనాడులో బీజేపీకి బాగా టఫ్ పోటీ ఉంటుంది. అస్సోం, పుదుచ్చేరీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. మళ్లీ గెలిచే అవకాశం ఉంది. అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్న ఏకైక రాష్ట్రం పశ్చిమబెంగాల్. అందుకే ఫలితాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నిస్తోంది.ప్రజల అసంతృప్తి, విభేదాలు తొలగించిన నడ్డా వ్యూహం బీజేపీకి అనుకూలం. 24 పర్గణాలు, కోల్‌కతాలో సీట్లు పెరిగితే అధికార మార్పు సాధ్యమే. తృణమూల్ వెల్ఫేర్ ప్లాన్లు సవాలు, కానీ బీజేపీ కేంద్ర పథకాల ప్రచారంతో ఆధిపత్యం స్థాపించవచ్చు. ఇది 2026 ఎన్నికల్లో బీజేపీకి కీలక విజయానికి దారితీస్తుంది.

# వైసీపీకి ఆల్ ఈజ్ వెల్ కాదా...

విజయవాడ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైకి ఆల్ ఈజ్ వెల్ అన్నట్టు ఉంది. 40% ఓటు బ్యాంకు ఉంది కాబట్టి తామే అధికారంలోకి వచ్చేస్తాం అంటూ ఆ పార్టీ కలలు కంటోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలతో దూసుకుపోతోంది. కేవలం సహజమైన ప్రభుత్వ వ్యతిరేకత తప్ప.. పతాక స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పాలన రెండేళ్ల పాటు సజావుగా నడిచిపోయింది. ఇటువంటి తరుణంలో తమను గట్టెక్కించేది నేషనల్ మీడియా అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు నేషనల్ మీడియా సర్వేల పేరిట వైసీపీకి అనుకూల ఫలితాలు కూడా ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు విరుద్ధ తీర్పు ఇచ్చారు. అయినా సరే నేషనల్ మీడియా జపం వదలడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మీడియా మద్దతు ఉంది. సొంత మీడియా సాక్షి అనుకూల ప్రచారం చేస్తోంది. కానీ ఆశించిన మైలేజ్ రావడం లేదు. మరోవైపు తెలుగులో ప్రముఖ న్యూస్ ఛానల్ గా ఉన్న రెండు మీడియాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయి. ఆపై సోషల్ మీడియా సైన్యం కూడా ఉంది. కానీ ఎందుకో పార్టీకి తగిన మైలేజ్ రావడం లేదు. అందుకే ఆ పార్టీ పునరాలోచనలో పడింది. నేషనల్ మీడియా సేవలను వినియోగించుకోవాలని చూస్తోంది. గతంలో ఇండిగో సంక్షోభ సమయంలో ఓ టిడిపి నేత మాట్లాడిన మాటలను పట్టుకొని.. లోకేష్ కు వ్యతిరేకంగా సదరు మీడియా ఛానల్ ప్రచారం చేసింది. తరువాత కూడా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా హడావిడి చేసింది.తాజాగా దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు ఓ నేషనల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన విషయంలో మాట్లాడే క్రమంలో చిన్నపాటి తప్పిదం దొర్లింది. దానిని వెంటనే సవరించుకున్నారు. తప్పును సరిదిద్దుకున్నారు. కానీ సదరు



మీడియా ఉద్దేశపూర్వకంగా ఎడిట్ చేసిన చంద్రబాబు వ్యాఖ్యలను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేసింది. దానిని పట్టుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రెచ్చిపోయింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రచారం చేసింది. ఈ పరిస్థితులన్నింటినీ గమనిస్తే నేషనల్ మీడియాతో వైసిపి ఒప్పందం చేసుకుందాం అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఓ మీడియాకు ప్రకటనలతో పాటు ప్యాకేజీ రూపంలో భారీగా ముట్ట చెప్పారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో సర్వేల రూపంలో సదరు మీడియా వైసిపికి అనుకూల ఫలితాలు ఇచ్చేది. ఇప్పుడు కూడా అటువంటి ప్రయత్నాలు ఏవైనా మొదలయ్యాయా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్లాన్ చేస్తున్నారా? అనే అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. అయితే 2024 ఎన్నికల్లో ఆ ప్రయత్నం వర్కౌట్ కాలేదు. మరి ఇప్పుడు ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. అసలు అందులో ఎంత వాస్తవం ఉందో కూడా తెలియాలి.

# రోజుకో మలుపు తిరుగుతున్న స్వామిజీ, యోగి వివాదం



లక్నో,ఉత్తర్ ప్రదేశ్‌లో శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద, సీఎం యోగి ఆదిత్యనాథ్ మధ్య వివాదం ముదురుతోంది. మౌని అమావాస్య రోజున ప్రయాగ్‌రాజ్ మాఘ మేళాకు వచ్చిన స్వామిజీని అధికారులు అడ్డుకోవడం, పవిత్ర స్నానం చేయలేకపోవడం ఘర్షణకు దారితీసింది. సీఎం వ్యాఖ్యలకు స్వామిజీ కౌంటర్ ఇవ్వగా, యూజీసీ నిబంధనలపై కూడా స్వామిజీ స్పందించారు. ఈ నేపథ్యంలో, సీఎం యోగి, ప్రధానికి మద్దతుగా ఒక అధికారి రాజీనామా చేయడం ఈ వివాదం మరో మలుపు తిరిగింది. ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతికి మధ్య జరుగుతున్న వివాదం రోజు రోజుకూ తీవ్రమవుతోంది. తాజాగా, అయోధ్యకు చెందిన ఒక సీనియర్ అధికారి.. సీఎం యోగి, ప్రధానమంత్రి, రాజ్యాంగానికి మద్దతుగా తాను రాజీనామా చేస్తున్నానని చెబుతూ తన పదవికి రాజీనామా చేశారు. ప్రయాగ్‌రాజ్ మాఘ మేళాకు తన అనుచరులతో త్రివేణి సంగమానికి వచ్చిన స్వామి అవిముక్తేశ్వరానందను అధికారులు అడ్డుకుని, రథం దిగి నడుచుకుంటూ వెళ్లాలని అభ్యంతరం చెప్పిన సంగతి తెలిసిందే. ఇది చిలికి చిలికి గాలివానలా మారినట్టు పోలీసులు సాధువుల మధ్య తోపులాటకు దారితీసింది. ఆ సందర్భంగా రథాన్ని సంగమానికి దూరంగా తీసుకెళ్లడంతో శంకరాచార్య పవిత్ర స్నానం చేయలేకపోయారుదీనిని తనకు జరిగిన అవమానంగా పేర్కొంటూ.. స్వామిజీ అక్కడే తన శిష్యులు, అనుచరులతో కలిసి నిరసనకు దిగారు. ఇది శంకరాచార్య, సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. శంకరాచార్య పేరు ప్రస్తావించకుండానే రామాయణంలో హనుమంతుడిని మోసం చేయడానికి సాధువు వేషం వేసుకున్న 'కాలనేమి' అనే రాక్షసుడిని ఉద్దేశిస్తూ అలాంటి వారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. దీనికి కౌంటర్ ఇచ్చిన శంకరాచార్య.. యోగి ప్రస్తుతం రాజకీయ నాయకుడని, తనలాంటి సాధువుల మాదిరిగా మతపరమైన అంశాలకు జోలికి రావద్దని హెచ్చరించారు"రాజకీయ నాయకుడు అయిన ముఖ్యమంత్రి విద్య, ఆరోగ్యం, శాంతిభద్రతలు లేదా రాష్ట్ర శ్రేయస్సు గురించి మాట్లాడటం లేదు. ఆయన కాలనేమి గురించి, మతం, నాస్తికత్వం గురించి మాట్లాడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం? ముఖ్యమంత్రి తన రాష్ట్ర శ్రేయస్సు గురించి చర్చించాలి. మతానికి సంబంధించిన విషయాన్ని మత పెద్దలకే వదిలివేయాలి' అని ఆయన అన్నారు.అలాగే, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీలు, హెల్ప్‌లైన్‌లు, పర్యవేక్షణ బృందాలు ఏర్పాటుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నోటిఫై చేసిన కొత్త నిబంధనల వివాదం జోలికి కూడా శంకరాచార్య వెళ్లారు.ప్రభుత్వ నిబంధనలను జనరల్ కేటగిరీ విద్యార్థులు, పలువురు రాజకీయ నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దీనిపై స్వామిజీ మాట్లాడుతూ'ఏ కులం కూడా సహజంగా అన్యాయం చేయదు.. అన్యాయంగా వ్యవహరించేది వ్యక్తులే. ప్రతి కులంలో మంచి, చెడు రెండు రకాల వ్యక్తులు ఉంటారు. ఒక వ్యక్తి అన్యాయం చేయవచ్చు, కానీ మొత్తంగా ఏ కులాన్ని న్యాయంగా లేదా అన్యాయంగా ముద్ర వేయకూడదు. ఒక కులాన్ని మరొక కులానికి వ్యతిరేకంగా నిలబెట్టడం ద్వారా, మీరు తప్పుదారిలో వెళ్తున్నారు.. ఇది హిందూ మతానికి చాలా హాని కలిగించవచ్చు. కాబట్టి, ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మంగళవారం రాజీనామా చేసిన అయోధ్య డిప్యూటీ జీఎస్టీ కమిషనర్ ప్రశాంత్ కుమార్ సింగ్.. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ , ప్రధాని మోదీ, ఇతరులకు జరిగిన అవమానాన్ని తాను సహించలేనని ఆయన పేర్కొన్నారు. 'ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి, హోంమంత్రికి, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి మద్దతుగా, ప్రభుత్వ ఉద్యోగుల నిబంధనలకు అనుగుణంగా నేను రాజీనామా చేశాను. సమాజాన్ని విభజించే లక్ష్యంతో అవిముక్తేశ్వరానంద చేసిన అడ్డగోలు వ్యాఖ్యలు నాకు బాధ కలిగించాయి' అని సింగ్ అన్నారు. ముఖ్యమంత్రిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. 'ఈ ప్రభుత్వానికి నేను రుణపడి ఉన్నాను.. రోబోలా కేవలం జీతం తీసుకోవడం నా విధి కాదు. యోగి ఆదిత్యనాథ్ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి, ఈ అవమానాన్ని నేను సహించలేను' అని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ వ్యాఖ్యానించారు. యూజీసీ అంశంపై రాజకీయాలు చేయడం తనను బాధించిందని, రాజీనామా ఆమోదం తర్వాత సామాజిక సేవను మొదలుపెడతానని తెలిపారు.

# కాంగ్రెస్ గేరు మార్చే పనిలో షర్మిల...రాహుల్ ఓకే



అమరావతి,ఏపీలో కాంగ్రెస్ కి మంచి రోజులు రావాలని ఆ పార్టీ నేతలు కోరుకుంటున్నారు. కాంగ్రెస్ ఏపీలో రాజకీయంగా పతనావస్థకు చేరుకుని పుష్కర కాలం పూర్తి అయింది. 2014 ఫిబ్రవరి ఉమ్మడి ఏపీని రెండుగా విభజిస్తూ పార్లమెంట్ లో కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ టూ ప్రభుత్వం ఆమోదించిన బిల్లుతోనే ఏపీలో కాంగ్రెస్ పని అయిపోయింది అని తేలిపోయింది. మహామహులైన కాంగ్రెస్ నేతలు అంతా ఇతర పార్టీలలో సర్దుకున్నారు. వారి రాజకీయ జీవితాలు ఎలా ఉన్నా ఏపీలో హస్తం పార్టీకి ఖద్దరు హవాకు రోజులు పూర్తిగా చెల్లిపోయాయి.

మూడు ఎన్నికల్లో బొప్పి :

వరసగా చూస్తే 2014, 2019, 2024 ఇలా మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ కి తలబొప్పి కట్టింది. డిపాజిట్లు కూడా రాని పరిస్థితి ఎదురైంది. ఈ మూడు ఎన్నికల్లో టీడీపీకి వైసీపీకి మధ్యనే పోరు సాగింది. అయితే 2024 ఎన్నికల్లో వైసీపీ కూడా కోలుకోలేని దెబ్బ తిన్నది. కానీ ఆ పార్టీకి 40 శాతం ఓటు షేర్ వచ్చింది. అది ఆ పార్టీకి ధీమా అయితే గడచిన ఇరవై నెలల కాలంలో వైసీపీ యాక్టివిటీస్ పెద్దగా లేకపోవడం అసెంబ్లీకి ఆ పార్టీ ఎమ్మెల్యేలు వెళ్లకపోవడం వంటి వాటి మూలంగా అనేక కీలక నిర్ణయాలలో విధానపరమైన గందరగోళం మూలంగానూ వైసీపీ వెనకబడుతోంది అని ప్రచారంలో ఉంది. ఎన్డీయే కూటమి ఏపీలో ఉంటే వైసీపీ ఇతర విపక్షాలను కలుపుకుని ఆల్టర్నేషన్ ఫ్రంట్ ని నిర్మించలేకపోతోంది. దానికి వైసీపీ కారణాలు దానికి ఉన్నాయి. అయితే ఇవన్నీ కూడా ఏపీలో రాజకీయ శూన్యత ఉందా అంటే ఉండొచ్చు అన్న భావనను కలుగజేస్తున్నాయి.

పోయిన చోటనే వెతుక్కుంటూ :

ఈ క్రమంలో పోయిన చోటనే వెతుక్కోవాలన్నది కాంగ్రెస్ ఆలోచన. అందుకే వైఎస్సార్ బ్లడ్ అయిన వైఎస్ షర్మిలను తెచ్చి ఏపీ పీసీసీ చీఫ్ గా నియమించారు. ఆమె గతంలో కొంత వరకూ ప్రయత్నించినా ఈ మధ్య తగ్గారు, అయితే తాజాగా ఆమె మళ్ళీ స్పీడ్ పెంచారు. ఇక షర్మిల రాజకీయ వైఖరిలోనూ పూర్తిగా మార్పు కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇపుడు ఏకంగా కూటమినే విమర్శిస్తోంది. వైసీపీని పక్కన పెడుతోంది. ఇది కచ్చితంగా కాంగ్రెస్ కి కలసి వచ్చే అంశగా చెబుతున్నారు. అధికారంలో ఉన్న పార్టీని విమర్శించడం ద్వారానే ఎక్కడైనా ఎవరైనా ప్రయోజనం పొందుతారు. కాంగ్రెస్ సరైనా రూట్ లోకే ఇపుడు వచ్చిందని అంటున్నారు.

రాహుల్ రాకతో :

తాజాగా ఢిల్లీ వెళ్ళి కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్ గాంధీని షర్మిల కలిశారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ చేసే ఉద్యమంలో పాలుపంచుకోవాలని ఆమె స్వయంగా ఆయనను ఆహ్వానించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని కాంగ్రెస్ దేశవ్యాప్తంగా కోరుతోంది. ఏపీ కాంగ్రెస్ అయితే దీని మీద రాష్ట్ర స్థాయిలో ఉద్యమించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో అనంతపురం జిల్లాలో ఫిబ్రవరి 2న జరిగే ఆందోళనలో పాల్గొనాలని షర్మిల కోరిన మేరకు రాహుల్ ఓకే చెప్పారు సరిగ్గా 20 ఏళ్ళ క్రితం వైఎస్సార్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ నుంచే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సోనియా గాంధీ అనంతపురం జిల్లా బండ్లపల్లి వచ్చి మరీ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. దాంతో అక్కడ నుంచే కాంగ్రెస్ ఉద్యమాన్ని స్టార్ట్ చేయాలని షర్మిల నిర్ణయించి రాహుల్ ని ఆహ్వానించారు. ఇక మీదట ఏపీలో కాంగ్రెస్ గేర్ మార్చి జోరు పెంచుతుందని అంటున్నారు.

# రికార్డుల నిర్మలమ్మ...బడ్జెట్ సీతారామమ్మ !


న్యూఢిల్లీ,కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి ఎంతో ప్రత్యేకత ఉంది. ఆమె 2014 నుంచి నరేంద్ర మోడీ కేబినెట్ లో పనిచేస్తూ వస్తున్నారు. ఆమె ఇందిరాగాంధీ తర్వాత రెండవ మహిళా రక్షణ మంత్రిగా పనిచేసిన కీర్తిని దక్కించుకున్నారు. రక్షణ మంత్రిగా జలాంతర్గాములలో ప్రయాణించి సాహసానికి మారు పేరుగా నిలిచారు. ఇక 2019లో నరేంద్ర మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చినపుడు ఆమె శాఖను మార్చి దేశానికే ఆర్థిక వ్యవహారాలు చూసే కీలక బాధ్యతలు అప్పగించారు. ఆ విధంగా నిర్మలా సీతారామన్ నాటి నుంచి నేటి వరకూ వరసగా ఎనిమిది బడ్జెట్ లను ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్ తో కలుపుకుంటే ఆమె తొమ్మిదవ బడ్జెట్ తో రికార్డు క్రియేట్ చేశారు.

ఆమెకు ఆమెనే సాటి :

ఈ రికార్డ్ ఏంటి అంటే ఒకే ప్రభుత్వంలో వరసగా ఇన్ని బడ్జెట్లు ప్రవేశపెట్టడం. నిజానికి తొమ్మిది బడ్జెట్లు దేశంలో ప్రవేశపెట్టిన వారు లేరా అంటే దిగ్గజ నేత పి చిదంబరం ఉన్నారు. కానీ ఆయన వరసగా తొమ్మిది బడ్జెట్లు ప్రవేశ పెట్టలేదు, వేరు వేరు ప్రభుత్వాలలో ఆయన బడ్జెట్లు ప్రవేశపెట్టారు. అలా గ్యాప్ తీసుకుని ఆయన తొమ్మిది బడ్జెట్లు దేశానికి ఇచ్చారు అన్న మాట. దాంతో నిర్మలమ్మనే ఈ విషయంలో గ్రేట్ అని అంటున్నారు. ప్రభుత్వం మారలేదు, ఒకే ప్రధాని నాయకత్వంలో ఆమె వరసగా బడ్జెట్లు ఇన్ని దేశానికి అందించారు అన్న మాట.

ఒక్క అడుగు దూరంలో :

మరో వైపు చూస్తే ఈ దేశంలో అత్యధిక బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ కి తిరుగులేని రికార్డు ఉంది. ఆయన కూడా



1957 నుంచి 1969 మధ్యలో ఈ బడ్జెట్లు అందించారు. కానీ వేరు వేరు ప్రభుత్వాలలో అన్న మాట. సో కంటిన్యూగా ఇచ్చిన ఘనత ఇక్కడ కూడా నిర్మలమ్మదే. ఇక నిర్మలా సీతారామన్ ఇప్పటికే తొమ్మిది బడ్జెట్లతో రికార్డు సాధించారు. వచ్చే ఏడాది ఆమె 10వ బడ్జెట్ ప్రవేశపెడితే మొరార్జీ దేశాయ్ రికార్డు సమం చేస్తారు, 2028 తో ఆమె మొరార్జీ దేశాయ్ నే అధిగమిస్తారు, 2029లో ప్రవేశపెట్టే ఓటాన్ అకౌంట్ తో కలుపుకుంటే డజన్ బడ్జెట్లు దేశానికి అందించిన ఆర్థిక మంత్రిగా మహిళా నేతగా నిర్మలమ్మ రికార్డుని సమీప భవిష్యత్తులో ఎవరూ దాటి వెళ్ళలేరు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే నిర్మలమ్మ బడ్జెట్ విషయంలో సరికొత్త రికార్డుతో తనదైన చరిత్రను సృష్టించారు అని అంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com